www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం 29 ఏప్రిల్ 2021 సంపుటి : 02 | సంచిక : 289 పేజీలు : 4 | వెల : రూ 3-00



## విద్యార్థుల పాలిట జగన్ కంసుడే: లోకేష్

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థుల పాలిట జగన్‌రెడ్డి కంసుడు అని తేలిపోయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ కరోనా సెకండ్ వేవ్ ఉధృతంగా ఉన్న దశలో కేంద్రం, దాదాపు అన్ని రా(ష్ట్రాలూ పరీక్షలు రద్దు, వాయిదా వేస్తే, ఒక్క ఏపీలోనేపరీక్షలు నిర్వహిస్తామని మొండిగా ముందుకెళ్లడం జగన్‌రెడ్డి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అంటూ దీర్ఘాలు తీస్తున్న జగన్‌రెడ్డి అధ్వానపాలనలో వారు బతికి ఉంటే కదా భవిష్యత్తు? అని మండిపడ్డారు. అంబులెన్సులు రావని, ఆక్సిజన్ లేదని, జనం పిట్టల్లా రాలిపోతున్నారని అన్నారు.

# కోవాగ్జిన్‌తోనే సెకండ్ వేవ్ కట్టడి

### ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ఆంథోనీ ఫౌసీ
### కోవాగ్జిన్‌తో 617 వారియెంట్ న్యూట్రలైజ్






న్యూఢిల్లీ: దేశంలో కరోనా విజృంభిస్తోన్న వేళ అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాన వైద్య సలహాదారు డాక్టర్ ఆంథోనీ ఫౌసీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోవిడ్ కట్టడికి భారత్ బయోటెక్ సంస్థ అభివృద్ధి చేస్తున్న కరోనా టీకా కోవాగ్జిన్ సమర్థవంతంగా చెక్ పెడుతున్నట్లు తాము గుర్తించామని వెల్లడించారు. మహమ్మారి విలయతాండవం చేస్తున్న వేళ మీడియాతో మాట్లాడిన ఆయన సెకండ్ వేవ్ కట్టడికి కోవాగ్జిన్ బాగా పనిచేస్తుందని.. ఈ విషయాన్ని భారత్‌లో నమోదవుతున్న రోజూవారి డాటా ఆధారంగా తాము గుర్తించినట్లు ఆంథోనీ ఫౌసీ తెలిపారు. "ఇండియాలో రోజూ కరోనా సోకుతున్న వారి డాటాను పరిశీలిస్తున్నాం. అయితే కోవాగ్జిన్ కారణంగా ఇటీవల కేసుల సంఖ్య స్థిరంగా ఉన్నట్లు గుర్తించాం. సెకండ్ వేవ్‌కు చెక్ పెట్టాలంటే వ్యాక్సిన్లు తప్పని సరిగా వేయించుకోవాలి అని ఆంథోనీ ఫౌసీ చెప్పినట్లు పీటీఐ తన కథనంలో పేర్కొంది.

బీ.1.617 వేరియంట్‌లో మూడు కొత్త స్పైక్ ప్రోటీ న్లు

మహారాష్ట్ర, ఢిల్లీలలో నమోదైన కరోనా కేసుల్లో కనిపించే బీ.1.617 వేరియంట్‌లో మూడు కొత్త స్పైక్ ప్రోటీన్లు ఉన్నట్లు తేలింది. కాబట్టే దేశంలో సెకండ్ వేవ్ విరుచుకుపడుతుంది. అయితే కోవాగ్జిన్‌ను వినియోగించడం ద్వారా ఇమ్యూనిటీ పవర్ పెరిగి, కరోనా వైరస్‌కు వ్యతిరేకంగా ప్రతిరోధకాలను తయారు చేస్తుంది. ఆ ప్రతిరోధకాలు శరీర కణజాలంలో ఎక్కడో ఓ చోట దాక్కున్న వైరస్‌ని గుర్తించి, దాన్ని నాశనం చేస్తుంది అని నిపుణులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ బీ.1.617 వేరియంట్‌ని 17 దేశాలలో గుర్తించినట్లు అ మెరికా హెల్త్ ఏజెన్సీ తెలిపింది. కాగా భారత్, యూకే, యూఎస్, సింగపూర్‌లలో ఈ వేరియంట్ కేసులు ఎక్కువగా ఉ న్నట్లు డబ్ల్యూహెచ్‌ఓ తన అధికారిక వెబ్ సైట్‌లో పొందుపరిచింది.

భారత్ బయోటెక్ - ఐసీఎంఆర్ భాగస్వామ్యంలో తయారీ

భారత్ బయోటెక్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) భాగస్వామ్యంతో కోవ్యాక్సిన్ తయారైంది.

# 'జగనన్న వసతి దీవెన నగదు జమ చేసిన సీఎం జగన్

### తల్లులే నేరుగా ఫీజులు కట్టడం వల్ల జవాబుదారీతనం
### అమ్మఒడి పథకం కింద డబ్బు లేదా ల్యాప్‌టాప్
### మార్కులను బట్టే ఏ విద్యార్థికైనా కాలేజీలో సీటు






అమరావతి ( విభారె) : 'జగనన్న వసతి దీవెన పథకం కింద అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.1,048.94 కోట్లను విడుదల చేశారు. ఈ మేరకు 2020-2021 సంవత్సరానికి మొత్తం 10,89,302 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సీఎం జగన్ క్యాంపు కార్యాలయంలో కంప్యూటర్ బటన్ నొక్కి తొలి విడత నగదు జమచేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. ఉన్నత చదువులే పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి అని, విద్యా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి ప్రపంచంతో పోటీ పడాలని, చదువుకు పేదరికం అడ్డు కాకూడదని సీఎం జగన్ తెలిపారు. ప్రతి ఏడాది రెండు వాయిదాల్లో ‹జగనన్న వసతి దీవెన› నగదు జమ చేస్తామని పేర్కొన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ ఆపై కోర్సులు చదివే విద్యార్థులకు సాయం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేస్తున్నామని, తల్లులే నేరుగా ఫీజులు కట్టడం వల్ల జవాబుదారీతనం వస్తుందని సీఎం జగన్ అన్నారు. కోవిడ్ సమయంలో కూడా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. 10.89లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.1048.94 కోట్లు జమ చేస్తున్నామని చెప్పారు. ‹జగనన్న వసతి దీవెన› ద్వారా 2,270 కోట్లు సాయం చేశామని, ‹జగనన్న వసతి దీవెన› ద్వారా విద్యారంగంలో డ్రాప్ అవుట్‌లు తగ్గాయని సీఎం జగన్ తెలిపారు. వచ్చే ఏడాది నుంచి సీబీఎస్‌ఈ సిలబస్‌ను తీసుకొస్తామని అన్నారు. వచ్చే ఏడాది నుంచి ‹అమ్మఒడి› పథకానికి ఆప్షన్లు ఇచ్చామని, అమ్మఒడి పథకం కింద డబ్బు లేదా ల్యాప్‌టాప్ ఇస్తామని తెలిపారు. అంగన్‌వాడీలను వైఎస్ఆర్ ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారుస్తున్నామని వివరించారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకంవ ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్షలపై విమర్శలు సరికాదని, ప్రతి విద్యార్థి భవిష్యత్ కోసం తాను ఆలోచిస్తాని సీఎం జగన్ తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో కూడా కొంత మంది విమర్శలు చేస్తున్నారని, అన్ని రా(ష్ట్రాల్లోనూ ఒకే విధమైన పాలసీ లేదన్నారు. పరీక్షల విషయాన్ని కేంద్రం రా(ష్ట్రాలకే వదిలేసిందని గుర్తు చేశారు. కొన్ని రా(ష్ట్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని, టెన్త్, ఇంటర్ సర్టిఫికెట్లపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని తెలిపారు. మార్కులను బట్టే ఏ విద్యార్థికైనా కాలేజీలో సీటు వస్తుందని గుర్తుచేశారు. టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణను బాధ్యతగా తీసుకుంటామని తెలిపారు. కోవిడ్‌పై పోరాటంలో కచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి కోవిడ్ కల్లోలంలోనూ దాన్ని తూచా తప్పకుండా సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా విద్యార్థుల బంగారు భవితే లక్ష్యంగా గత వారం 'జగనన్న విద్యా దీవెనవ కింద పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మొదటి త్రైమాసికం కింద రూ.671.45 కోట్లు వారి తల్లుల ఖాతాలకు సీఎం జమ చేసిన విషయం తలిసిందే. ఇప్పుడు వసతి, భోజన ఖర్చులకు రూ.1,048.94 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమచేశారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ఏటా రెండు వాయిదాల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేల చొప్పున, డిగ్రీ, ఆపై కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున వసతి, భోజన ఖర్చులను చెల్లించేందుకు 'జగనన్న వసతి దీవెనవ కార్యక్రమానికి సీఎం రూపకల్పన చేశారు. 'జగనన్న వసతి దీవెనవ పథకం ద్వారా ఇప్పటికే రూ.1,220.99 కోట్లను చెల్లించారు. మొదటి విడతగా రూ.1,048.94 కోట్లను చెల్లించారు. దీంతో ఇప్పటివరకు జగనన్న వసతి దీవెన కింద రూ.2,269.93 కోట్లు చెల్లించారు.

## ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు

అమరావతి: ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కొవిడ్ రోగులకు అందుతున్న చికిత్సపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. సామాజిక కార్యకర్త తోట సురేష్, ఏపీ సివిల్ లిబర్టీస్ అసోసియేషన్ వేసిన పిటిషన్లపై ఏపీ హైకోర్టులో సుదీర్ఘంగా విచారణ జరిపారు. ఆస్పత్రుల్లో అందుతున్న చికిత్స, ఫీజుల వసూలు, ఇతర అంశాలపై వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయాలని హైకోర్టు సూచించింది. ఆస్పత్రుల్లో రోగులు, ఖాళీల వివరాలపై డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని, రెమ్‌డెసివిర్, అత్యవసర మందులపై రోజువారీ సమీక్ష ఉండాల్సిందేనని హైకోర్టు సూచించింది. ఆక్సిజన్ కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విచారణలో పేర్కొంది. ఆక్సిజన్ కొరతపై ప్రతిరోజు సమీక్ష నిర్వహించాలని కూడా తెలిపింది. రాష్ట్రంలో ఐసోలేషన్ కేంద్రాలను పెంచం చాలని హైకోర్టు సూచించింది. అలాగే పడకల సౌలభ్యాన్ని అందుబాటులోకి తీసుకోవాలని పేర్కొంది.

# 5 నుంచి ఇంటర్ పరీక్షలు: కలెక్టర్ ఇంతియాజ్



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): కోవిడ్ మార్గదర్శకాలను పాటిస్తూ ఇంటర్మీడియెట్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. మంగళవారం నగరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ మే 2021 నిర్వహణపై కలెక్టర్ అధ్యక్షతన కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ మే 5వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నామని, ఇందుకు సంబంధించి జిల్లాలో మొత్తం 142 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిలో విజయవాడ నగర పరిధిలో 77 కేంద్రాలను ఏర్పాటు చేయగా, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో 65 సెంటర్లను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.జిల్లాలో 1,12,154 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షలు రాయనున్నారని, వారిలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు 54,171 మందికాగా రెండవ సంవత్సరం పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 57,983 మంది ఉన్నారని కలెక్టరు అన్నారు. పరీక్షలు పకడ్బందీ నిర్వహణకు, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకు న్నామని, దీనిలో భాగంగా అన్ని పరీ కేంద్రాల వద్ద 104 సెక్షన్ అమల్లో ఉంటుందని, 4 ఫయింగ్ స్క్వాడ్‌లను నియమించామని, 8 సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ప్రతీ పరీ కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, కోవిడ్ మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలు చేసేలా ప్రతీ పరీ కేంద్రం వద్ద కోవిడ్ ప్రొటోకాల్ ఆఫీసర్‌ను నియమించామని, ఐసోలేషన్ గదిని కూడా ఏర్పాటు చేశామని కలెక్టర్ వెల్లడించారు.పరీ కేంద్రాలను కలుపుతూ ఆర్టీసీ బస్సులను నడిపేందుకు రూట్ వివరాలను ఆర్టీసీ అధికారులకు అందించామని, పరీక్షలు జరిగే తేదీల్లో ఉదయం 6.30 గంటల నుంచి విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కలెక్టరు ఆదేశించారు. పరీ కేంద్రాల వద్ద అవసరమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, విజయవాడ నగరపాలక సంస్థ అడిషినల్ కమిషనరు మోహనరావు, డి(స్టిక్ట్ ఎగ్జామినేషన్స్ కమిటీ కన్వీనర్ ఆర్ఐఓ పి.రవికుమార్, డి(స్టిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ మెంబర్లు కె.యోహాన్, షేక్ అహ్మద్, బి.వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.మచిలీపట్నం: కృష్ణా యూనివర్సిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ కేబీ చంద్రశేఖర్ ఆమోదంతో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి.రామశేఖరరెడ్డి ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. పరీక్ష ఫీజు, పరీక్షల టైంటేబుల్‌ను వర్సిటీ వెబ్‌సైట్ నందు పొందుపరిచామన్నారు. విద్యార్థులు పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం కల్పించామన్నారు. తొలిసారిగా ఏపీసీఎఫ్ఎస్ఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్ష ఫీజు, ఫలితాల ప్రక్రియ నిర్వహణ జరుగుతుందని తెలిపారు.

## ఆక్సిజన్ అందుబాటులో ఉంది.. ఆందోళన చెందొద్దు

అమరావతి( విభారె) : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా వైరస్ కట్టడికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి ఆళ్లనాని తెలిపారు. కోవిడ్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కరోనా బాధితుల కోసం 37 వేల వరకు బెడ్స్ పెంచామని చెప్పారు. అవసరానికి తగ్గట్టు ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచినట్లు.. ఎవరూ ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. అమరావతిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెమిడెసివిర్ ఇంజక్షన్ల కొరత లేకుండా చూస్తామని చెప్పారు. ఇప్పటివరకు 62 లక్షల మందికిపైగా వ్యాక్సినేషన్ ఇచ్చామని వెల్లడించారు. చంద్రబాబు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని మండిపడ్డారు. సంక్షోభ సమయంలోనూ చంద్రబాబు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.




## అస్తమించిన యుద్ధ వీరుడు.. సీఎం జగన్ సంతాపం

### రిటైర్డ్ మేజర్ జనరల్ వేణుగోపాల్ కన్నుమూత

తిరుపతి ): దేశ సరిహద్దుల్లో శత్రువుతో వీరోచిత పోరాటం చేసి పదవీ విరమణ పొందిన యుద్ధవీరుడు మాజీ మేజర్ జనరల్ సి.వేణుగోపాల్ (95) అనారోగ్యంతో కన్నుమూశారు. మంగళవారం తిరుపతిలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. 1927 నవంబర్ 14న జన్మించిన వేణుగోపాల్ దేశానికి సేవ చేయాలనే తపనతో ఆర్మీలో హవల్దార్‌గా చేరి నేషనల్ డిఫెన్స్ అకాడమీ (డెహ్రాడూన్)లో సీటు సాధించారు.అనంతరం లెఫ్టినెంట్ కల్నల్ హొదాకు ఎదిగి, మేజర్ జనరల్ హొదాలో పదవీ విరమణ చేశారు. దేశానికి చేసిన సేవకు గుర్తింపుగా రాష్ట్రపతి చేతుల మీదుగా 'పరమ విశిష్ట సేవా మెడల్వ, 'మహా వీరచక్రవ అవార్డులు అందుకున్నారు. 36 ఏళ్లు ఆర్మీలో కొనసాగిన ఆయన దేశ సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తూ వివాహానికి సైతం దూరంగా ఉన్నారు.ఈ ఏడాది ఫిబ్రవరి 18న తిరుపతి వేదికగా జరిగిన సాయుధ దళాల స్వర్ణోత్సవాల కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన గృహానికి వెళ్లి సత్కరించారు. వేణుగోపాల్ కొన్నేళ్లుగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. సీఎం జగన్ సంతాపంమాజీ మేజర్ జనరల్ సి.వేణుగోపాల్ (95) మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.



# నిరుద్యోగులు అధైర్యపడొద్దు.. ఎంతటి పోరాటానికైనా సిద్ధం: షర్మిల

హైదరాబాద్: నిరుద్యోగులు అధైర్యపడవద్దని.. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం తాను ఎంతటి పోరాటానికైనా సిద్ధమని వైఎస్ షర్మిల ట్విటర్ వేదికగా పేర్కొన్నారు. శ్రీకాంత్ అనే నిరుద్యోగి నోటిఫికేషన్లు రాలేదని ఆత్మహత్యకు పాల్పడిన విషయమై ఆమె ట్విటర్ వేదికగా స్పందించారు. "నిరుద్యోగులు అధైర్యపడద్దు. ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎంతటి పోరాటానికైనా నేను సిద్ధం. నిరుద్యోగ యువతను.. మీ అక్కగా నేను కోరేది ఒక్కటే. దయచేసి ఆత్మహత్యలకు పాల్పడొద్దు. రేపటి భవిష్యత్తు కోసం.. నేడు మార్పు తేవాల్సిందే. ఆ మార్పు కోసం మనం కలిసి పోరాడుదాంవవ అని షర్మిల ట్వీట్ చేశారు.కాగా.. ఉద్యోగ నోటిఫికేషన్లు



లేవని.. ఇక వచ్చే అవకాశం లేదని ఇప్పటికే వరంగల్‌కు చెందిన ఒక నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. తాజాగా నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంలలో మరో నిరుద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# సంపాదకీయం

గురువారం 29 ఏప్రిల్ 2021

## విమర్శలేనా...సూచనలు ఉండవా

కరోనాప్రయాణంలో రాజకీయ పిడకల వేట జోరుగా సాగుతోంది. మన నాయకులు మహా ముదుర్లు. వచ్చిన ఏ అవకాశాన్ని జారవిడుచుకోరు.అందుకే కరోనా ప్లాట్ ఫారంపై పొలిటికల్ వార్ షురు చేస్తున్నారు. జాతి మొత్తం ఒకే బాటన నడవాల్సిన ఉపద్రవం కొనసాగుతోంది. ఎప్పుడేం జరుగుతుందో, ఎంతమంది చనిపోనున్నారో తెలియనిస్థితి. కంటికి కనిపించని శత్రువుతో సాగుతున్న యుద్ధం. ఈ స్థితిలో రాజకీయ లాభనష్టాలను పక్కనపెట్టి ముందుగా ప్రజల్లో చైతన్యం కలిగించడానికి ప్రయత్నించాలి. అధికార పార్టీ, ప్రతిపక్షం అన్న తేడా లేకుండా ప్రజలకు వైద్యం సక్రమంగా అందేలా చూడాలి. కానీ మనదేశంలో పరస్పర విమర్శలు, ఆరోపణలు, నిందలకే సమయం సరిపోతోంది. ప్రయివేటు ఆసుపత్రుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. వాక్సిన్ ఉత్పత్తుల కంపెనీలు సైతం తమకు నచ్చిన రేట్లు పెట్టుకుంటామని ప్రకటించినా ఏం చేయలేని నిస్సహాయత కొనసాగుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఆసరాగా చేసుకుంటూ పైకి ఎగబాకాలనుకుంటున్న నాయకుల విడ్డూరమైన ప్రవర్తన వింత గొలుపుతోంది. పెద్ద నాయకులను చూసి యువనాయకులూ అదే బాట పడుతున్నారు.ప్రజల్లో తన పలుకుబడి, సమర్థత ఏమిటో ఇంతవరకూ నిరూపించుకోలేకపోయిన యువనేత , తెలుగుదేశం పార్టీ వారసుడు లోకేశ్. ఎన్నికలు, ఇతర అంశాల్లో పార్టీ పరంగా తాను ఏ విధమైన నిర్ణయాలు తీసుకున్నప్పటికీ పర్వాలేదు. లాభపడితే పార్టీ ప్రయోజనం పొందుతుంది. నష్టపోతే పార్టీకే చేటు వస్తుంది. కానీ విద్యార్థుల పరీక్షల వంటి సున్నిత అంశాలనూ రాజకీయ మయం చేయాలని చూడటం అపరిపక్వతకు నిదర్శనం. పది, ఇంటర్మీడియట్ పరీక్షలను లక్షలమంది రాయాల్సి ఉన్న మాట నిజం. కొన్ని రాష్ట్రాలు ఈ పరీక్షలను రద్దు చేశాయి. ఆంధ్రప్రదేశ్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. దీనిపై తాను ఉద్యమం చేస్తానంటూ లోకేశ్ ప్రకటించడం రాజకీయ అవకాశవాదమనే చెప్పాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సహా కలిపి 80 లక్షల మంది ప్రాణాలు ప్రమాదంలో పడతాయి కాబట్టి పరీక్షలు రద్దు చేయాల్సిందేననేది ఆయన డిమాండ్. మరి తిరుపతి ఉప ఎన్నికలో 20 లక్షల మంది ప్రాణాలు ప్రమాదంలో పడతాయి కాబట్టి ఎన్నికను బహిష్కరించేందుకు తెలుగుదేశం ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోయింది. లోకేశ్, చంద్రబాబు ఊరూరా తిరిగి మరీ జనంలోకి వెళ్లారు కదా. పరీక్షల విషయంలో విద్యార్థుల ఆరోగ్యం, వారి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని అన్ని వర్గాలతో చర్చించి ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. తల్లిదండ్రులు, విద్యార్థుల తాత్కాలిక మూడ్ ను ఎన్ క్యాష్ చేసుకుందామనే రాజకీయ డిమాండ్లు ఎటువంటి ఫలితం ఇవ్వవు. జాతీయంగా ఉన్నత విద్యాసంస్థల్లో మన విద్యార్థులకు లభించే అవకాశాలు, గ్రేడ్లు వంటి వాటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. లోకేశ్ యువతతో కనెక్ట్ కావాలని పార్టీలో డిమాండ్ వినవస్తోంది. అందుకు పరీక్షల ఎగవేత డిమాండ్ ను దగ్గరి దారిగా ఎంచుకున్నారేమో అనిపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో ఉన్నప్పుడు లోకేశ్ కు గైడింగ్ ప్రిన్సిపాల్ రేవంత్ రెడ్డి. దూకుడు కలిగిన నేత. తెలంగాణలో టీడీపీకి నూకలు చెల్లిపోవడంతో కాంగ్రెసులో ప్రవేశించి కీలకమైన స్థానానికి ఎదిగారు. మరింత ఎదిగేందుకు ప్రయత్నిస్తుంటే కింద నుంచి కాళ్లు పట్టుకుని లాగేస్తున్నారు సీనియర్ నాయకులు. అయినప్పటికీ అధికారపార్టీపై విమర్శలు, ఆరోపణల విషయంలో మాత్రం రేవంత్ ను కొట్టేవారే లేరు. హుందాతనం, స్థాయి భేదం మరిచి విమర్శలు గుప్పించడం లో అందె వేసిన చెయ్యి. ముఖ్యమంత్రి కేసీఆర్ సాగర్ లో కలవాలి. ప్రధాని నరేంద్రమోడీ ఎర్రకోటపై నుంచి దూకాలి అంటూ చేసిన దుందుడుకు వ్యాఖ్యలు రేవంత్ అసహనాన్నే బయటపెట్టాయి. విమర్శ తీవ్రత వ్యక్తిగతంగా మారితే అసలు విషయం పక్కదారి పడుతుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం, ఉదాసీనత, వైఫల్యాలను ఎత్తి చూపాలి. తప్పు పట్టాలి. అంతే తప్ప నాయకులను వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకుంటూ అనుచితంగా దూషించడం వల్ల ప్రచారమే తప్ప ఫలితం శూన్యం.కొందరు అగ్రనాయకులు సైతం రాజకీయ ప్రచారానికే ప్రాముఖ్యం ఇస్తున్నారు. దేశంలో ఎక్కడ వాక్సిన్లు అవసరం ఎక్కువగా ఉంది? ఎక్కడ ఆక్సిజన్ అవసరాలు పెరిగాయి? అనే కోణంలో ప్లాన్ చేసుకోవాలి. దేశం మొత్తాన్ని ఒక యూనిట్ గా భావించాలి. అంతే తప్ప కొందరు ముఖ్యమంత్రులు తమ రాష్ట్రం , తమ అవసరాలు అనే కోణంలో మందులు, వాక్సిన్లు, ఆక్సిజన్ అవసరానికి మించి నిల్వ చేసేయాలనే తాపత్రయాన్ని కనబరుస్తున్నారు. ఇది మిగిలిన ప్రాంతాల ప్రజలలో నిజమైన అవసరమున్న రోగులకు ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. కొందరు కోటేశ్వరులు తమకు రోగం రాకున్నా ప్రయివేటు ఆసుపత్రుల్లో పడకలను రిజర్వ్ చేసుకుని ఉంచుకుంటున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఇది మరింత దారుణం. అందులోనూ రాజకీయ నాయకుల సిఫార్సులతో చాలా చోట్ల ప్రయివేటు ఆసుపత్రుల పడకలు బ్లాక్ అయిపోతున్నాయి. తమలో తాము విమర్శించుకోవడం మానేసి నాయకులు ఆసుపత్రుల్లో అందుతున్న సౌకర్యాలపై నిఘా పెడితే మంచిది. రాజకీయ నాయకులు అంటే అధికారులకు, ఆసుపత్రుల నిర్వాహకులకు ఎంతో కొంత భయం, భక్తి ఉంటాయి. పడకలను బ్లాక్ చేయడం, మందుల కృత్రిమ కొరత సృష్టించడాన్ని ప్రతిపక్ష నాయకులు వెలికి తీస్తే ప్రభుత్వ పెద్దలకు భయం పుడుతుంది. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ ప్రధానితో సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడం వివాదాస్పదమైంది. అంతర్గతంగా తీసుకోవాల్సిన చర్యలపై ప్రధాని సమావేశాన్ని ఏర్పాటు చేశారు. దానిని ఒక ప్రచార అంశంగా వాడుకోవాలని చూశారు కేజ్రీవాల్. కరోనా వంటి విపత్కర సమయంలోనూ రాజకీయ ఉద్దేశాలు నాయకుల ధోరణిలో తొంగి చూస్తున్నాయి. రెండో విడత కరోనా విజృంభణ తగ్గుముఖం పట్టేవరకైనా తమ పొలిటికల్ హంగ్రీని కొంచెం వాయిదా వేసుకుంటే మంచిది.

# ధూళిపాళ్ల నెక్స్ట్ ఏంటీ



గుంటూరు, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ నుంచి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఐదు సార్లు విజయం సాధించారు. అది కూడా టీడీపీ నుంచే ఇక, ఆయన తండ్రి.. వీరయ్య చౌదరి కూడా రెండు సార్లు గెలిచారు. ఫలితంగా పొన్నూరు రాజకీయాల్లో ధూళిపాళ్ల కుటుంబానికి ప్రత్యేక స్థానం ఏర్పడింది. ఓవరాల్‌గా ఈ నియోజకవర్గంలో ఈ కుటుంబానికి నాలుగు దశాబ్దాల ఘనమైన రాజకీయ చరిత్ర ఉంది. అలాంటి ఘనమైన చరిత్ర ఉన్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ రాజకీయంపై ఆసక్తికరమైన చర్చ సాగుతుండడం గమనార్హం. ఆయన వ్యవహారం ఏంటి ? ఏదిశగా అడుగులు వేస్తున్నారు ? అనే విషయం.. రాజకీయ వర్గాల్లో హల్ చల్ చేస్తోంది.గత ఎన్నికల్లో కేవలం ఒకే ఒక్కసారి.. అది కూడా కేవలం వెయ్యి ఓట్లతో మాత్రమే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఓడిపోయారు. అప్పటి నుంచిఆయన యాక్టివ్‌గా లేకుండా పోయారు. ముఖ్యంగా పాతిక సంవత్సరాలు తనకు టికెట్ ఇచ్చి.. ఆదరించిన.. టీడీపీని స్థానికంగా పటిష్టం చేసే ప్రయత్నం ఎంత మాత్రం చేయడం లేదన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. ఏదైనా తనకు సమస్య వస్తే.. వెంటనే మీడియా ముందుకు వస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అదే టీడీపీకి ఎదైనా సమస్య వస్తే.. మాత్రం మౌనంగా ఉండిపోతున్నారు. రాజధాని భూముల విషయంలో తనపై ఆరోపణలు వస్తే.. వెంటనే మీడియా ముందుకు వచ్చి ఖండించారు. కానీ.. టీడీపీ చేపట్టిన అమరావతి ఉద్యమానికి మొక్కుబడిగా మాత్రమే మద్దతిచ్చారు.ఇక, రాష్ట్రంలో గుజరాత్‌కు చెందిన అమూల్ పాల ఉత్పత్తులను ప్రభుత్వం ప్రవేశ పెట్టగానే ఆదరాబాదరాగా.. మీడియా ముందుకు వచ్చి.. తమ డెయిరీ ఉత్పత్తులను దెబ్బకొట్టేందుకు ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ చైర్మన్‌గా ఉన్న సంగం డెయిరీకి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో తిరుగులేని మార్కెట్ ఉంది. దీనికి అనుబంధంగా హాస్పటల్ కూడా నిర్మించారు. దీంట్లో చాలా అవకతవకలు ఉన్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక టీడీపీ మద్దతుదారులను పంచాయతీ ఎన్నికల్లో ఇదే గుంటూరులో నామినేషన్ కూడా వేయకుండా వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారన్న విషయంపై మాత్రం నరేంద్ర మౌనం పాటిస్తున్నారు.ఇలా.. అనేక విషయాల్లో తనకు ఇబ్బంది ఉంటే నోరు విప్పడం.. లేదంటే.. సైలెంట్ అవడం గమనార్హం. పైగా పొన్నూరు సిట్టింగ్ ఎమ్మెల్యేతో లోపాయికారీగా చేతులు కలిపారనే వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే ఇప్పుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కు పెద్ద మైనస్ అయిపోయింది. నరేంద్ర ఎప్పుడూ ఎమ్మెల్యే కిలారు రోశయ్యపై చిన్న విమర్శ కూడా చేయరు. అలాగే రోశయ్య సైతం నరేంద్రను పన్నెత్తు మాట అనరు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వీరికి ఇష్టమైన గ్రామాల్లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకునేలా ఒప్పందం చేసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి.ఉమ్మడి రాష్ట్రంలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అంటే ఓ పొలిటికల్ కింగ్. 2004లో వైఎస్ ప్రభంజనంలో జిల్లాలో 19 సీట్లకు 18 చోట్ల టీడీపీ ఓడితే పొన్నూరులో నరేంద్ర మాత్రమే గెలిచారు. ఆ తర్వాత వైఎస్ పట్టుబట్టి 2009లో నరేంద్రను ఓడించాలనుకున్నా గెలిచారు. వైఎస్ లాంటోడ్నే ఎదుర్కొని నిలిచిన నరేంద్ర అప్పట్లో పార్టీపై ఈగ వాలినా మీడియా ముందుకు వచ్చి ఓ రేంజ్‌లో రెచ్చిపోయేవారు. అలాంటిది ఆయన ఇప్పుడు నియోజకవర్గ స్థాయిలోనే మిలాఖత్ రాజకీయాలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నా? వాటిని ఖండించకపోవడం సగటు టీడీపీ అభిమానినే డిజప్పాయింట్ చేస్తోంది. పార్టీ కోసం చేయడం మానేసి? తన కోసం తాను చేసుకునే రాజకీయ నేతగా ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మారిపోయారనే పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

# రాజమండ్రి కోసం కసరత్తు షురూ...

రాజమండ్రి, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)త్వరలో నగారా మ్రోగనున్న రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికలకు టిడిపి ఇప్పటి నుంచి కసరత్తు ముమ్మరం చేసింది. ఎపి అంతా జగన్ ఫోబియా లో ఉండటంతో ఎలాగైనా నాలుగోసారి రాజమండ్రి కార్పొరేషన్ గెలిచి తమ సత్తా చాటాలని సైకిల్ పార్టీ తహతహ. మూడు సార్లు రాజమండ్రి కార్పొరేషన్ ను వరుసగా గెలిచిన టిడిపి గత ఫార్ములా తో ముందుకు వెళుతుందా లేక కొత్త వ్యూహంతో బరిలోకి దిగనుందా అన్న చర్చ జోరుగా నడుస్తుంది. ఈ మూడు సార్లు ఎన్నికలకు ప్రస్తుత రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే టిడిపి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి సారథ్యంలోనే నడిచాయి. ఆయన టిక్ పెట్టిన వారికే టిక్కెట్లు దక్కాయి. మేయర్ అభ్యర్థులను గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఫైనల్ చేయడం జరిగింది. అయితే ఈసారి ఆయన మార్క్ లేకుండా ఎన్నికలకు టిడిపి బరిలోకి దిగనుందని అంటున్నాయి పార్టీ వర్గాలు. అర్బన్ నుంచి రూరల్ కి గోరంట్ల మారడంతో ఆయనకు సహజంగానే నగరంలో పట్టు సడలింది. అయినప్పటికీ రూరల్ లో కొన్ని డివిజన్లు కార్పొరేషన్ లో ఉన్నప్పటికి గతంలోని ఆధిపత్యం రాబోయే ఎన్నికల్లో ఆయనకు ఉండదు.ప్రస్తుత ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని కుటుంబమే అన్ని తామే అయ్యి కార్పొరేషన్ ఎన్నికలకు నడుం బిగిస్తుంది. జగన్ సునామీ లో భారీ మెజారిటీ తో టిడిపి నుంచి భవాని గెలిచారు. దాంతో అధిష్టానం సైతం ఆదిరెడ్డి కుటుంబాన్ని కాదని నిర్ణయాలు తీసుకోవడానికి సాహసం చేయదు. ఈ నేపథ్యంలో అన్ని బలగాలతో సిద్ధం అవుతూ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న అధికారపార్టీని ఢీకొనడం చిన్న విషయం కాదు. అయితే టిడిపి లో రోజు రోజు సీనియర్లు ఫ్యాన్ కిందకు చేరి గాలి పీలుస్తున్నారు. సైకిల్ కి తరచూ రాజమండ్రిలో పంచర్లు పడుతున్నాయి. ఈ పరిస్థితి ఎన్నికల ప్రకటన వచ్చే నాటికి మరింతగా పెరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి. చాలా నియోజకవర్గాల్లో టిడిపికి అభ్యర్థులే లేకుండా చేయాలన్న ఎత్తుగడతో ఎంపి భరత్ రామ్ టీం గట్టిగా దృష్టి పెట్టింది. ఇదే ఇప్పుడు ఆదిరెడ్డి టీం ను కలవరపెడుతుంది.గోరంట్ల బుచ్చయ్య చౌదరికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోయినా ఆయన కార్పొరేషన్ ఎన్నికలకు అనుసరించిన మార్గాలని ఆదిరెడ్డి అనుసరిస్తారా లేదా అన్నది చూడాలి. రాజమండ్రి మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్ గా అవతరించిన తొలి ఎన్నికల్లో విశాఖ నుంచి దిగుమతి చేసుకున్న ఎం ఎస్ చక్రవర్తిని మేయర్ గా ప్రకటించారు గోరంట్ల బుచ్చయ్య చౌదరి . నాటి ప్రత్యక్ష ఎన్నికల్లో ఆయన వ్యూహం పనికొచ్చింది. టిడిపి విజయం సాధించింది. రెండోసారి ఆదిరెడ్డి అప్పారావు సతీమణికి గోరంట్ల బుచ్చయ్య చౌదరి టికెట్ కి టిక్ పెట్టారు. పార్టీలో ఉన్నవారికి కాకుండా భర్త పార్టీలో ఉంటె భార్యకు ఎలా ఇచ్చేశారన్న విమర్శలు బుచ్చయ్య ఎదుర్కొన్నా నాటి వ్యూహం కూడా ఫలించింది. ఇక ముచ్చటగా మూడోసారి గోరంట్ల కాంగ్రెస్ నేత గా ఉన్న పంతం కొండలరావు భార్య పంతం రజని ని పార్టీలో చేర్చుకుని మేయర్ గా ప్రకటించారు గోరంట్ల బుచ్చయ్య చౌదరి. నాడు కూడా తీవ్ర విమర్శలనే ఆయన ఎదుర్కొన్నా అప్పటి వ్యూహం కూడా సక్సెస్ అయ్యి హ్యాట్రిక్ విజయాలు పార్టీ ఖాతాలో జమచేశారు గోరంట్ల. ఇలా త్రి టైమ్స్ కూడా పార్టీ జండా నేరుగా మోసిన వారికి కాకుండా కొత్త వారిని తెచ్చే గెలుపు తీరానికి చేర్చారు ఆయన. ఈసారి సరికొత్త వ్యూహంతోనే టిడిపి తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది అంటున్నారు ఆ పార్టీ వర్గాలు.

రెండు వర్గాలుగా టీడీపీ

రాజకీయ చైతన్య కెరటం రాజమహేంద్రిలో కరోనా విజృంభణకు మించి నేతలు విజృంభిస్తున్నారు. అతి త్వరలో కార్పొరేషన్ ఎన్నికలకు గంట కొట్టేస్తారన్న టెన్షన్ తో అధికార వైసిపి ప్రధాన ప్రతిపక్షం టిడిపి కత్తులు ఎడా పెడా నూరేస్తున్నాయి. నిత్యం మీడియా సమావేశాలు, సభలు, కార్యక్రమాలు జోరుగా నడుస్తున్నాయి. డివిజన్ల పునర్విభజన, రిజర్వేషన్ల అంశంపై ఇరు పక్షాలు గట్టిగా దృష్టి సారించాయి. ఇటీవల స్థానిక ఎన్నికల్లో టిడిపి ఘోర పరాజయంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నిండిపోవడంతో నేతలు వారిలో ధైర్యాన్ని ఉత్సహాన్ని నింపేందుకు కసరత్తులు ముమ్మరం చేస్తున్నారు.టిడిపి నేతలు ఎంత ధైర్యం నూరిపోస్తున్నా మీకు అండగా దండగా ఉంటామని భరోసా ఇస్తున్నా బలమైన నేతలు అధికార వైసిపి లోకి దూకేస్తున్నారు. వీరిలో చాలామంది మాజీ కార్పొరేటర్లు కావడం గమనార్హం. అయితే కొత్తగా వైసిపి లోకి వస్తున్న వారితో అధికారపార్టీ కళకళలాడుతున్న వివిధ డివిజన్ల పై ఆశలు పెంచుకున్న ఫ్యాన్ పార్టీ కి చెందిన కొందరిలో ఆందోళన మొదలైంది.

కొత్తగా వచ్చినవారికి టిక్కెట్ హామీ లభిస్తే తమ గతేమి అవుతుందన్న బెంగ వారిలో మొదలైంది. సీనియర్ నేతలు ఫ్యాన్ కింద సేద తీరడాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు సైకిల్ దిగిపోవడానికి రెడీ గా ఉన్నట్లు సమాచారం. అయితే ఎన్నికల ప్రకటన వచ్చాకా కొందరు దానికి ముందు మరికొందరు వచ్చేలా అధికారపార్టీ ప్లాన్ చేసినట్లు ప్రచారం నడుస్తుంది.టిడిపి వర్గాల్లో మరో బెంగ ఉంది. పసుపు పార్టీలో సీనియర్ నేత పొలిట్ బ్యూరో సభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు వర్గాల నడుమ సమన్వయం సాధ్యం అయితేనే అధికారపార్టీకి ఎదురొడ్డి పోరాడగలమని కానీ ప్రస్తుతం ఆ సీన్ కనుచూపు మేరలో కనిపించడం లేదని ఆ పార్టీలో వారే భావిస్తున్నారు. దాంతో రాజమండ్రి కార్పొరేషన్ లో మేయర్ స్థానాన్ని హ్యాట్రిక్ గా గెలుచుకువచ్చిన తెలుగుదేశం నాలుగోసారి తామే గెలుస్తామన్న ధీమా పైకి వ్యక్తం చేస్తున్నా లోలోపల అనుమానాలు వ్యక్తం చేస్తుందంటున్నారు.ఇక అధికారపార్టీ లో గ్రూప్ లు ప్రస్తుతం సైలెంట్ అయినా కార్పొరేషన్ ఎన్నికల టిక్కెట్ల సమయంలో బయటపడే అవకాశాలు ప్రస్ఫుటం గా కనిపిస్తున్నాయి. జగన్ హవా తో ఈసారి టిక్కెట్ దక్కించుకుంటే చాలు విజయం అదే దక్కుతుందన్న నమ్మకంతో అధికారపార్టీలో ఒక్కో డివిజన్ నుంచి ముగ్గురు నలుగురు సీట్లు ఆశించే వారు సిద్ధం అయిపోయారు. వీరికి తోడు టిడిపి నుంచి వచ్చే వారికి బెర్త్ లు కేటాయించాల్సి ఉంటుంది. దాంతో బెర్త్ ఎవరికి దక్కుతుందో ఉత్కంఠ రెక్కేత్తించే అంశమే. రాజమండ్రి కార్పొరేషన్ లో విజయం సాధించి తీరాలని ఇప్పటికే అధినేత జగన్ నేతలందరికి లక్ష్య నిర్దేశ్యం చేశారు. అంతే కాదు ఏ మాత్రం తేడా కొట్టినా నేతల ప్రయార్టీలు ఉల్టా పల్టా అవుతాయని సీరియస్ గానే వార్నింగ్ ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో రాజమండ్రి రాజకీయాలు ఎండలను మించి మండిపోతున్నాయి

# సోముకు ముందు ఉందంతా... మొసళ్ల పండుగే

గుంటూరు, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఆర్ఎస్ఎస్ మూలాల నుంచి వచ్చిన నేత. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ఆయనను ఏరికోరి అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. కానీ సోము వీర్రాజు పదవీ బాధ్యతలు చేపట్టిన ముహూర్తం బాగాలేనట్లుంది. ఆయన అధ్యక్షుడు అయిన తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లో పార్టీ ఏమాత్రం పనితీరు కనపర్చక లేకపోయింది. నేతలను సమన్వయం చేసుకోలేకపోవడమే ఇందుకు కారణం.సోము వీర్రాజు కరడు కట్టిన కమలం నేత. దానికి ఎవరూ కాదనలేరు. అదే సమయంలో పార్టీ ఎదగాలంటే అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. కానీ సోము వీర్రాజు మాత్రం అందుకు ఇష్టపడలేదు. ఏ ఎన్నిక వచ్చిన తన టీంతోనే ఆయన ముందుకు సాగారు. ఇది పార్టీ కేంద్ర నాయకత్వం దృష్టికి కూడా వెళ్లిందంటున్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఘోర పరాభావం చూసిన బీజేపీ తిరుపతి ఉప ఎన్నికలోనైనా కనీస ప్రతిభను కనపర్చాల్సి ఉంది.తిరుపతి ఉప ఎన్నికలో కనీసం రెండో స్థానంలో ఉండాలన్నది సోమువీర్రాజు ప్రయత్నం. ఆయన అభ్యర్థిని ఎంపిక చేయకముందు నుంచే తిరుపతిలో మకాం వేసి పార్టీని ముందుకు నడిపే ప్రయత్నం చేశారు. కానీ టీడీపీ మూలాలున్న వారిని ఎవరిని దగ్గరకు రానివ్వలేదు. దీంతో పాటు జనసేనతో కూడా సోము వీర్రాజు వైఖరి ఆ పార్టీ క్యాడర్ కు ఆగ్రహం తెప్పించింది. చివరకు పవన్ ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించేంత వరకూ వారి అసంతృప్తి చల్లారలేదు.ఇక తిరుపతి ఉప ఎన్నికల్లో బీజేపీ ఎలా చూసినా రెండో స్థానానికి వచ్చే అవకాశం లేదు. కనీసం డిపాజిట్లు దక్కితే చాలు అన్నది కొందరినేతల భావన. ఇటీవల తిరుపతి పర్యటనకు వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సయితం నేతలను సమన్వయం చేయలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు. సోము వీర్రాజుకు ఈ తిరుపతి ఉప ఎన్నిక ఇబ్బందిగా మారనుందన్న సంకేతాలను ఆయన ఇచ్చి వెళ్లారు. మొత్తం మీద సోము వీర్రాజుకు తిరుపతి ఉప ఎన్నిక ఫలితం తర్వాత ఉద్వాసన తప్పదన్న వ్యాఖ్యలు ఆ పార్టీ నుంచే విన్పిస్తున్నాయి.

# గురుమూర్తిపై బెట్టింగ్ లు పర్వం

తిరుపతి, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)తిరుపతి పార్లమెంటు స్థానానికి జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ జోరందుకుంది. నిన్న మొన్నటి వరకు అభ్యర్థుల విషయంలోను, పార్టీల విషయంలోనూ పెద్దగా క్లారిటీ లేకపోవడంతో ఒకింత స్తబ్దుగాఉన్న రాజకీయ వేడి.. ఇప్పుడు అభ్యర్థుల ఖరారు? నామినేషన్ల పర్వం ముగియడంతో రాజకీయంగా కూడా తిరుపతి నియోజకవర్గంపై రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు దృష్టి పెట్టారు. ఇప్పటికే ఇక్కడ విజయం తమదేనని వైసీపీ గంటాపథంగా చెబుతోంది. అదేసమయంలో టీడీపీ తరఫున పోటీ చేస్తున్న పనబాక లక్ష్మి.. కూడా గెలుపుపై ధీమానే వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు.. బీజేపీ తరఫున రాజకీయ అరంగేట్రం చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి రత్నప్రభ.. కూడా గెలుపు వన్ సైడ్ అవుతుందని చెబుతున్నారు.. ఇంకోవైపు.. కాంగ్రెస్ తరఫున పోటీకి దిగుతున్న మాజీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ కూడా గెలుపు గుర్రం ఎక్కుతానని అంటున్నారు. అసలు గెలుపు ఎవరిది అన్నది పక్కన పెట్టేస్తే ప్రధాన పార్టీల తరఫున పోటీ చేస్తోన్న అభ్యర్థులు అందరూ కూడా గెలుపు విషయంలో తమదే అన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక ప్రచార పర్వంలో ఎవరి వ్యూహాలు వారు అనుసరిస్తున్నారు. ఈ క్రమంలో ఎవరు గెలుస్తారనే విషయం పక్కన పెడితే. వైసీపీ తరఫున తొలిసారి రాజకీయ అరంగేట్రం చేసిన డాక్టర్ గురుమూర్తి విషయంలో మాత్రం బెట్టింగులు పెరుగుతున్నాయి.తెలంగాణకు చెందిన కీలక బెట్టింగు వీరులు రంగంలోకి దిగినట్టు సమాచారం. ఇక, ఏపీకి చెందిన వారు కూడా బెట్టింగులు కడుతున్నారు. ఇక్కడ బెట్టింగులు అన్నీ గురుమూర్తి కేంద్రంగానే నడుస్తున్నాయి. గురుమూర్తి గెలుపు మాత్రమే కాదు.. ఆయనకు వచ్చే మెజార్టీ ఏ స్థాయిలో ఉంటుంది అనేదానిపై ఒకటికి రెండు, మూడు రూపాయల వరకు పెచ్చు ఇచ్చి మరీ బెట్టింగ్‌లు కాస్తున్నారు. బెట్టింగ్ రాయుళ్లు ఇప్పటికే పలు ప్రైవేటు సర్వేల ఏజెన్సీలతో నిత్యం టచ్‌లో ఉంటూ ఏడు నియోజకవర్గాల్లో ఎక్కడ ఎంత మెజార్టీ వస్తుందన్నది కూడా లెక్కలు వేసుకునీ మరి బెట్టింగ్‌లకు దిగుతున్నారు.ఒకటి రెండు సెగ్మెంట్లు మినహా అన్ని చోట్లా వైసీపీ అభ్యర్థి గురుమూర్తికి పూర్తి ఏకపక్ష మెజార్టీ వస్తుందనే సర్వేలు చెపుతున్నాయి. ప్రస్తుతం తిరుపతిలో ఎక్కడా చిన్న హోటల్ రూం కూడా లభించడం లేదు. దీనికి కారణం.. బెట్టింగు రాయుళ్లు దాదాపు 50 మంది వరకు తిరుపతిలోనే మకాం వేసి మరీ.. బెట్టింగులకు తెరదీశారు. ఎక్కువ మంది బెట్టింగు రాయుళు ... 3 ? 3.50 లక్షల మెజారిటీ వైపు మొగ్గు చూపుతుండడం గమనార్హం.

# మహిళా మంత్రులపై అవినీతి..


## సీఎంఓకు చేరిన కథ

విజయవాడ, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్) అవినీతి రహిత రాష్ట్రం ఏర్పాటు చేయడం మా లక్ష్యం!.. అందుకే ఎక్కడ అవినీతి జరిగినా మాకు వెంటనే సందేశం పంపండి చర్యలు తీసుకుంటాం" అని.. ఎన్నికల అనంతరం.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీఎం జగన్ పదే పదే చెప్పిన, చెబుతున్న మాట. అయితే.. ఇప్పటి వరకు ప్రతిపక్షాలు అనేక రూపాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. అయితే.. వాటన్నింటినీ.. కూడా రాజకీయ విమర్శలుగా కొట్టి పారేశారు పార్టీ అధినేత. కానీ, ఇప్పుడు సీఎం జగనే తెప్పించుకున్న కొన్ని నివేదికల్లో ఇద్దరు మహిళా మంత్రుల ఇలాకాల్లో అవినీతి కంపుకొడుతోందని తేలడంతో ఏం చేయాలా? అని ఆయన ఆలోచిస్తున్నట్టు వైసీపీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.ఈ ఇద్దరు మంత్రుల్లో ఒకరు కోస్తా ప్రాంతానికి చెందిన వారు కాగా.. మరొకరు గోదావరి జిల్లాలకు చెందిన వారుగా చెప్పుకొంటున్నారు. కీలకమైన శాఖలను చూస్తున్న వీరిద్దరూ కూడా తమ కుటుంబాలను కట్టడి చేయలేక పోతున్నారని అంటున్నారు. నిజానికి వీరిద్దరూ నిజాయితీ పరులుగానే ఉన్నారు.కానీ, వారి కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం కార్యాలయాల్లోకి చేరుకుని.. ప్రతి పనికీ ఇంతని రేటు కడుతున్నారని.. పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఓ మంత్రిగారి భర్త.. "ఇవన్నీ మామూలే" అని మీడియాతో కూడా అనేస్తున్నారట. ఈ మేరకు జగన్ కు నివేదిక అందిందట.ఈ నేపథ్యంలో ఆ నోటా ఈనోటా.. ఈ అవినీతి బాగోతం గురించి. ఏకంగా సీఎంవోకు ఉప్పందంది.. దీంతో జగన్ ఏకంగా వీరిపై రహస్య నివేదికలు తెప్పించుకున్నారు. వీటిలో మంత్రుల బంధువులు, వారి ఇంట్లో వారు ఎలాంటి అవినీతికి పాల్పడుతున్నా రు? అనే విషయాలు కూలంకషంగా ఉన్నాయని సమాచారం. నిజానికి మంత్రులు కానీ, ఎమ్మెల్యేలు కానీ.. అవినీతికి పాల్పడితే.. వచ్చే ఎన్నికల్లో టికెట్ కూడా ఇచ్చేది లేదని చెప్పారు జగన్. ఈ విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అంటున్నారు.అయినప్పటికీ.. ఒకరిద్దరు మంత్రులు అవినీతికి పాల్పడుతూనే ఉన్నారు. ఇప్పుడు ఏకంగా మహిళా మంత్రులు కూడా చేతులు కడుక్కోవడం.. సంచలనం సృష్టిస్తోంది. వీరిలో ఒక మంత్రిని తప్పించేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకున్న జగన్ మరో కీలక మహిళా మంత్రి విషయంలో మాత్రం ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి.

# అవునా... పంతం తీరేదా

విజయవాడ, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)చంద్రబాబుది అండర్ కరెంట్ పాలిటిక్స్. బయటకు కనిపించకుండా చాప కింద నీరులా చేయాల్సింది చేస్తారు. అదే జగన్ ని తీసుకుంటే ముక్కు సూటిగా రాజకీయం ఉంటుంది. ఇపుడు జగన్ చేస్తున్న రాజకీయం చూసిన వారదరికీ కలిగే ఒకే ఒక్క డౌట్ చంద్రబాబుని జగన్ ఏనాటికైనా అరెస్ట్ చేయిస్తారు అని. తన ఫస్ట్ టెర్మ్ పదవీ కాలం ముగిసే లోపుగా చంద్రబాబుకు జైలు రుచి జగన్ చూపించి తీరుతారు అని. నిజంగా జనాలు అనుకోవడానికి కూడా కారణాలు ఉన్నాయి. జగన్ వచ్చిన దగ్గర నుంచి బాబు గత పరిపాలన మీద ఎడతెరిపి లేకుండా విచారణల మీద విచారణలు జరిపిస్తున్నారు.బాబుకు అదే ధైర్యం. అదే నిబ్బరం. బాబు మీద జగన్ సర్కార్ మాత్రమే కేసులు పెట్టలేదు. అంతకు ముందు వైఎస్సార్ హయాంలో కూడా కేసులు పెట్టారు. దానికి ముందు కొన్ని ప్రైవేట్ కేసులు కూడా పెట్టారు. మరి ఆయన అత్త లక్ష్మీ పార్వతి పెట్టిన కేసులు కానీ, కేసీయార్ సర్కార్ పెట్టిన ఓటుకు నోటు కేసులు కానీ ఇపుడు ఏ దశలో ఉన్నాయి అంటే ఎవరూ చెప్పలేరు. ఒక లెక్క ప్రకారం బాబు 18 నుంచి ఇరవై దాకా స్టేలు తెచ్చుకున్నాడు అని అంటారు. అందువల్లనే ఆయన్ని ఇపుడు వైసీపీ మంత్రి కొడాలి నాని స్టేల బాబు అని ఎకసెక్కమాడుతున్నారు.తాను పదహారు నెలల పాటు జైలులో ఉన్నాను కాబట్టి కనీసం పదహారు రోజులు అయినా బాబుని జైలులో ఉంచాలన్నది జగన్ పంతం. కానీ అది ఎప్పటికీ నెరవేరదు అని మాజీ మంత్రి టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అంటున్నారు. బాబు మీద ఎన్ని కేసులు పెట్టుకున్నా ఆయన నిప్పే అంటున్నారు ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ అచ్చెన్నాయుడు. బాబు మీద ఆధారాలు కేసులు పెడితే స్టేలు తెచ్చుకోకుండా ఎలా ఉంటామని తమ్ముళ్ళు గర్జిస్తున్నారు. జగన్ అవినీతి మీద ఆధారాలు ఉండబట్టే కేసులు పడ్డాయి. బాబు విషయంలో ఒక్క ఆరోపణను అయినా నిరూపించగలరా అంటూ తమ్ముళ్ళు సూటిగానే అడుగుతున్నారు.మహాకవి శ్రీనాధుడు ఒక పద్యంలో అంటాడు. శత్రువు మదిలో మెదులుతూంటే ఎంతో సౌకర్యవంతమైన పానుపు ఉన్నా కేసులకు నిద్ర పడుతుందా అని. అలాగే ఇపుడు జగన్ సీఎం గా ఉన్నారు.

## ఢిల్లీ యాత్రకు చంద్రబాబు



గుంటూరు, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఢిల్లీ యాత్రకు సిద్ధమవుతున్నారు. జగన్ ప్రభుత్వంపై ఫిర్యాదులు చేయడంతో పాటు వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు కేంద్ర పెద్దలను కలుస్తారని టాక్. ఈ మేరకు ఆయన మోదీ, అమిత్ షాల అపాయింట్ మెంట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తొలుత అమిత్ షా అపాయింట్ మెంట్ కోసం కీలక నేత ఒకరు ఢిల్లీలోనే ఉండి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.చంద్రబాబు ఢిల్లీ వెళ్లి దాదాపు రెండేళ్లు కావస్తుంది. 2019 ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయన ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీని కలిశారు. మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ను కూడా కాంగ్రెస్ తో కలసి వెళ్లి ఫిర్యాదులు చేశారు. ఆ తర్వాత చంద్రబాబు ఇక ఢిల్లీ వెళ్లలేదు. మరోసారి కేంద్రంలో మోదీ అధికారంలోకి రావడం, తాను ఇక్కడ దారుణ ఓటమి పాలు కావడంతో ఆయన ఢిల్లీ వైపు చూడలేదు. కానీ ఇక ఎన్నికలకు మరో మూడేళ్ల సమయమే ఉంది. ఇప్పటి నుంచే కమలం పార్టీ పెద్దలతో సయోధ్య కుదుర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ పెద్దలతో తనకున్న సంబంధాలను చంద్రబాబు ఉపయోగించుకుంటున్నారు. మూడు పార్టీలు వచ్చే ఎన్నికల్లో కలసి పోటీ చేయకపోతే జగన్ ను ఎదుర్కొనడం కష్టమవుతుందని చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. అందుకే బీజేపీ, జనసేన తో కలసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు.ముందుగా బీజేపీని ఒప్పించగలిగితే పవన్ కల్యాణ్ కలిసేందుకు రెడీగా ఉన్నారు. టీడీపీకి స్థానాలను కొన్ని తగ్గించుకునైనా మిత్ర పక్షాలకు సీట్లను త్యాగం చేసేందుకు చంద్రబాబు రెడీ అయిపోయారంటున్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు దక్కకుంటే పార్టీ మనుగడే కష్టమవుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత చంద్రబాబు ఢిల్లీ టూర్ ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. మొత్తం మీద ఎన్నికలకు మూడేళ్ల ముందే చంద్రబాబు ప్రయత్నాలు మొదలుపెట్టేశారంటున్నారు.

## సంగం డెయిరీ స్వాధీనానికి ప్రయత్నాలు

గుంటూరు, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)సంగం డెయిరీని టార్గెట్ చేసుకునే ధూళిపాళ్ల నరేంద్రను ప్రభుత్వం అరెస్ట్ చేయించిందనే దానికి వరుసగా జరుగుతున్న పరిణామాలు బలం చేకూరుస్తున్నాయి. సంగం డెయిరీకి ఉన్న మిల్క్ ప్రొడ్యూసర్స్ అనుమతిని రద్దు చేసింది. .. సంగం డెయిరీ యాజమాన్య హక్కులను మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసేసింది. సంగం డెయిరీని గుంటూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి బదిలీ చేసినట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొంది. రోజువారీ వ్యవహారాలను చూసే బాధ్యతను తెనాలి సబ్ కలెక్టర్ కు ఇప్పగించింది. ఆయన ఉత్తర్వుల్ని తీసుకుని హుటాహుటిన సంగం డెయిరీకి చేరుకున్నారు. డెయిరీని అధీనంలోకి తీసుకునేందుకు సిద్ధమయ్యారు. సంగం డెయిరీ కంపెనీల చట్టం పరిధిలో ఉంది. అయితే ఆ చట్టంలోకి అక్రమంగా మార్చారని .. సంతకాలు ఫోర్జరీ చేశారని ప్రభుత్వం ఆరోపిస్తోంది. గతంలో ఈ అంశంపై నోటీసులు జారీ చేసింది. అయితే సంగం డెయిరీ చైర్మన్ గా ఉన్న ధూళిపాళ్ల నరేంద్ర హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చుకున్నారు. ఇప్పుడు అదే అంశాలపై మళ్లీ కేసులు పెట్టి రాత్రికి రాత్రి ధూళిపాళ్ల నరేంద్రను అరెస్ట్ చేయడమే కాకుండా? ఇంకా అక్రమాలు జరిగాయో లేదో నిర్ధారణ కాకుండానే? సంగం డెయిరీని స్వాధీనం చేసుకునేందుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తోంది. చైర్మన్, ఎండీలను అరెస్ట్ చేసి? రోజువారీ వ్యవహారాలకు భంగం కలగకూడదంటూ.. ప్రభుత్వం జాయింట్ కలెక్టర్‌ను సంగం డెయిరీకి పంపడం కలకలం రేపుతోంది. న్యాయవ్యవస్థను కూడా పట్టించుకోకుండా? సంగం డెయిరీని స్వాధీనం చేసుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అన్ని రకాల హద్దులను దాటేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై కోర్టుల్లో విచారణ జరిగే సరికి.. విజయవంతమైన ఆ డెయిరీకి చేయాగలిగినంత నష్టం చేయగలిగితే.. అమూల్‌కు అంత మేర లాభం కలుగుతుందనేది ప్రభుత్వ కుట్ర అని విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి.

## అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో భారీ అగ్నిప్రమాదం

### 90 లక్షల ఆస్తి బుగ్గిపాలు

కళ్యాణదుర్గం దశాబ్దాల తరబడి అక్కడ టింబర్ డిపోలు నిర్వహిస్తున్న యజమానుల్లో ఒక్కసారిగా అలజడి. రెక్కాడితే గాని డొక్కాడని పేద కూలీలు బతుకులను అగ్ని ప్రమాదం చిద్రం చేసింది. టింబర్ డిపో లను నిర్వహిస్తున్న యజమా నులు , వారి కింద పనిచేస్తున్న ఉపాధి కూలీలకు నిలువ నీడ లేకుండా చేసింది. పలువురు భవన యజమా నులు తమ ఇంటికి కావాల్సిన తలు పులు కిటికీలు సామాగ్రిని టింబర్ డిపో లలో నిల్వ ఉంచగా అగ్నిప్రమాదంలో అవి కూడా కాలి బూడిదయ్యా యి . ఈ మొత్తం సంఘటనలో సుమారు రూ. 90 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. కళ్యాణదుర్గం పట్టణం లోని వెంకటేశ్వర థియేటర్ ముందు భాగంలో ఉన్న టింబర్ డిపోల్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది.బుధవారం తెల్లవారుజా మున జరిగిన ఈ సంఘటన స్థానికంగా సంచలనం కలిగించింది. ఏమి జరిగిందో గుర్తించే లోపే డిపోల్లో ని మొత్తం కట్టి సామాను, మిషనరీ కి మంటలు వ్యాపించి కాలి బూడిద అయ్యాయి. సమాచారాన్ని అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు . అయితే జరగాల్సిన నష్టం జరిగిపోయిందని కార్మికులు కన్నీరు మున్నీరుగా విలపించారు . ఈ ప్రమాదానికి కారణం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేక మానవ తప్పిదం అనే కోణంలో విచారణ చేయాలని బాధితులు కోరుతున్నారు.

# ఫ్యాన్ గాలి కోసం... తమ్ముళ్లు తహ తహ

కాకినాడ, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)ఇపుడున్న రాజకీయ పరిస్థితులను జాగ్రత్తగా మదింపు చేసుకుంటున్న నేతలు అధికార వైసీపీలో చేరడానికి రెడీ అవుతున్నారు. దాంట్లో గతంలో పార్టీలో ఉండి ఫిరాయించిన వారు, టీడీపీలో కరడు కట్టిన వారు, ఇతర పార్టీలకు చెందిన వారు కూడా ఉండడం విశేషం. ఏపీలో ఇపుడు వైసీపీయే అతి పెద్ద బలమైన పార్టీగా నాయకులు భావిస్తున్నారు. పైగా మరో మూడేళ్ళ వరకూ అధికారానికి ఢోకా లేదని కూడా ఆలోచనలతోనే ఫ్యాన్ పార్టీ వైపు వెల్లువలా కదులుతున్నారని చెబుతున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి మొదలుపెడితే అనంతపురం దాకా టీడీపీ నుంచి వైసీపీ వైపు రూట్ మార్చేందుకు తమ్ముళ్ళు చెల్లెళ్ళు సిద్ధంగా ఉండడం విశేషం.ఇక కర్నూలు జిల్లాలో ఒకపుడు భూమా కుటుంబం ఎంతటి ప్రఖ్యాతిని గడించిందో అందరికీ తెలిసిందే. భూమా నాగిరెడ్డి మరణించాక అఖిలప్రియకు మంత్రి పదవి ఇచ్చి మరీ టీడీపీ చాలా రాజకీయాలు చేసింది. ఇపుడు అదే అఖిలప్రియ వైసీపీ ముంగిట ఉన్నారని అంటున్నారు. ఆమె స్వయంగా జగన్ తల్లి విజయమ్మ ద్వారా జగన్ తో రాయబేరాలు చేస్తున్నట్లుగా టాక్. తనకు పార్టీలో ప్రవేశం ఉంటే చాలు, ఎమ్మెల్యే టికెట్ కూడా అవసరం లేదని అఖిలప్రియ ప్రాధేయపడుతున్నారు అంటేనే ఆమె రాజకీయం టీడీపీలో ఎలా ఉందో అర్ధం చేసుకోవాలని చెబుతున్నారు.శ్రీకాకుళం జిల్లాలో కూడా పెద్ద ఎత్తున తమ్ముళ్ళు ఉప ముఖ్యామంత్రి ధర్మాన క్రిష్ణ దాస్ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. పార్టీలో చేరిపోతాం, మాకు పదవులు వద్దు, వైసీపీ జెండా నీడన ఉంటామని అంటున్నారుట. అయితే ఈ విషయంలో జిల్లాలో ఉన్న సీనియర్ మంత్రిగా క్రిష్ణదాస్ లైన్ క్లియర్ చేస్తేనే ఏదైనా సాధ్యపడుతుంది అంటున్నారు. చిత్రమేంటంటే వీరంతా దశాబ్దాలుగా టీడీపీని అంటిపెట్టుకుని ఉన్నవారే. మరి ఎందుకు ఇలా పార్టీని వీడుతున్నారు అంటే భవిష్యత్తు మీద బెంగతోనే అంటున్నారు.ఇక విశాఖ జిల్లాలో కూడా మాజీ ఎమ్మెల్యేలతో పాటు కొందరు సీనియర్ నేతలు విజయసాయిరెడ్డితో టచ్ లో ఉన్నారని అంటున్నారు. వీరంతా కూడా తాము వైసీపీలో చేరిపోతామని చెబుతున్నారు. పైగా ఇపుడు ఎలాంటి ఎన్నికలు కూడా లేవు, తమకు ఏ హోదాలు కూడా అవసరం లేదని అంటున్నారు. నియోజకవర్గాల్లో వర్గ పోరు లేకుండా ఉంటేనే కొత్త వారికి ప్రవేశం ఉంటుందని విజయసాయిరెడ్డి పక్కా క్లారిటీగా వారికి చెబుతున్నారు. అవసరం లేదు అనుకున్న వారిని చేర్చుకోమని కూడా ముఖం మీద చెప్పేస్తున్నారు. అదే విధంగా విజయనగరంలో కూడా బొత్స సత్యనారాయణ వద్దకు తమ్ముళ్ళు పరుగులు పెడుతున్నారు. అయితే బొత్స తనకు అనుకూలంగా ఉన్న వారిని చేరదీయడానికి చూస్తున్నారు అంటున్నారు. మొత్తానికి చూస్తే లోకల్ బాడీ ఎన్నికల తరువాత ఏపీలో మారిన రాజకీయ ముఖ చిత్రమే తమ్ముళ్లను సైకిల్ దిగేలా చేస్తోంది అంటున్నారు.

# పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా సజ్జల..?



విజయవాడ, ఏప్రిల్ 28, (న్యూస్ పల్స్)వైసీపీలో జగన్ సర్వం సహ అన్న మాట అయితే ఉంది. కానీ అన్నీ జగన్ చూడలేరు, చేయలేరు కూడా. మరి జగన్ కి తలలో నాలుకగా ఉండేవారే మిగిలిన విషయాలు చక్కబెడతారు అలా చూసుకుంటే ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ కి ఇపుడు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారు అన్న మాట అయితే ఉంది. పార్టీ పరంగా ఏ స్టేట్మెంట్ బయటకు రావాలన్నా కూడా అది సజ్జల రామకృష్ణారెడ్డి నోటి నుంచే వస్తుంది. చంద్రబాబుని విమర్శించినా మరో నేత మీద కామెంట్స్ చేసినా కూడా సజ్జలే మీడియా ముందుకు రావాలి.సజ్జల రామకృష్ణారెడ్డి అంతకు ముందు సాక్షి పత్రికను నడిపించారు. మీడియా రంగంలో అనుభవం గడించారు. అన్నింటికీ మించి ఆయన జగన్ సతీమణి భారతికి దగ్గర బంధువు అన్న ప్రచారం కూడా ఉంది. దీంతో ఆయన ఇపుడు జగన్ కి బాగా కావాల్సిన వ్యక్తిగా మారారని చెబుతున్నారు. ఈ నేపధ్యంలోనే ఆయన వైసీపీకి కొత్త శక్తిగా కూడా అవతరించారని పేర్కొంటున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి మంచి వాగ్దాటి ఉన్న నేత కాదు, సబ్జెక్టు మీద పూర్తి పట్టు ఉంది అని కూడా ఎవరూ చెప్పలేరు. కానీ ఆయన తాడేపల్లి ప్యాలెస్ కి బహు దగ్గర అంటే మాత్రం అంతా ఒప్పుకుంటారు.జగన్ పార్టీ కార్యక్రమాలను విభజించి కొందరికి అప్పగించారు. ఆ విధంగా చూస్తే గోదావరి జిల్లాల బాధ్యతలు వైవీ సుబ్బారెడ్డికి, ఉత్తరాంధ్రా బాధ్యతలు విజయసాయిరెడ్డికి అప్పగించారు. కానీ వైవీ సుబ్బారెడ్డి ఆయా జిల్లాల మీద దృష్టి పెట్టింది పెద్దగా లేదు. విజయసాయిరెడ్డి కూడా మునుపటి చురుకుదనం చూపించడంలేదు. దాంతో సజ్జల రామకృష్ణారెడ్డి మొత్తం పదమూడు జిల్లాలను తన కంట్రోల్ లోకి తెచ్చుకున్నారు అంటున్నారు. ముఖ్యమైన నేతలు, మంత్రులు సైతం ఆయనకు చేరువ అవుతూ తమ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారు అంటున్నారు.నిజానికి జగన్ పేరుకే ప్రెసిడెంట్ గా ఉంటున్నారు. ఆయనకు ముఖ్యమంత్రి బాధ్యతలతోనే సరిపోతోంది. పార్టీ విషయాలు మాట్లాడడానికి తీరుబాటు ఉండడంలేదు. దీంతో సజ్జల రామకృష్ణారెడ్డి అన్నీ చూస్తున్నారు అని చాలా కాలంగా ప్రచారంలో ఉంది. పార్టీలో పంచాయతీలు అన్నీ కూడా ఆయన చూస్తున్నారు. మరీ పెద్దవి అయితేనే జగన్ దృష్టిలో పెడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరికి టికెట్లు వస్తాయో ఎవరికి రావో కూడా సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పేస్తున్నారు. ఆ విధంగా కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిల మధ్య గొడవలు కూడా తీర్చారు. స్థానిక ఎన్నికలను సైతం మొత్తం మోనిటరింగ్ చేశారు. సరే అన్నీ ఆయనే చేస్తున్నారు కదా ఆయనకే వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చేయవచ్చు కదా అన్న మాట పార్టీలో ఉంది. కానీ సామాజిక సమీకరణల్లో తేడా వస్తుంది కాబట్టే ఆయనకు పార్టీ పరంగా పోస్ట్ ని కేటాయించకుండా కథ మొత్తం ఆయన ద్వారానే నడిపిస్తున్నారు అంటున్నారు. మొత్తానికి ఇపుడు జగన్ కుడి భుజం అంటే సజ్జల రామకృష్ణారెడ్డి అని చెప్పుకోవాలట

# కరోనా అంటే భయం వద్దు ... ధైర్యంగా ఉండాలి..

శ్రీకాకుళం, ఏప్రిల్ 28 కరోనా అంటే భయపడాల్సిన అవసరం లేదని శ్రీకాకుళం శాసనసభ్యులు ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం శాసనసభ్యులు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ కరోనా అంటే ప్రతి ఒక్కరూ భయపడుతున్నారని పేర్కొన్నారు. వాస్తవానికి కరోనా అంటే భయపడాల్సిన అవసరం లేదని, ఎవరు భయానక వాతావరణం సృష్టించవద్దని ఆయన కోరారు. భయపడేంత పరిస్థితులు లేవని ప్రసాదరావు స్పష్టం చేశారు. అందరూ సమష్టిగా పని చేయడం ద్వారా ఈ మహమ్మారిని పారద్రోల వచ్చుని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, ప్రజలు – అన్ని వర్గాలు ఒకరినొకరు సహకరించుకుంటూ ముందుకు సాగడం ద్వారా మహమ్మారిని మట్టు పెట్టవచ్చని ఆయన పేర్కొన్నారు. ఒకరి వైఫల్యాలను మరొకరు వేలెత్తి చూపడం ద్వారా ప్రయోజనం ఉండదని ఇటువంటి సందర్భంలో ఒకరికొకరు సహకరించుకోవాలని ఆయన హితవు పలికారు. ప్రభుత్వం కరోనా మహమ్మారిని నివారించుటకు అన్ని చర్యలు చేపట్టిందని, దేశంలోనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల పట్ల అందరూ ప్రశంసించారని ఆయన పేర్కొంటూ శ్రీకాకుళం జిల్లాలో సైతం జిల్లా యంత్రాంగం మంచి చర్యలు చేపట్టిందని ఆయన ప్రశంసించారు. కరోనా బాధితులు తమ సహాయార్థం 104 నెంబర్ కు ఫోన్ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 104 ఫోన్ చేయడం ద్వారా తక్షణ వైద్య సేవలు అందుబాటులోకి వస్తుందని, అవసరమైన సూచనలు సలహాలను వైద్యులు అందిస్తారని ఆయన పేర్కొన్నారు. హోమ్ ఐసోలేషన్ లో ఉన్నవారికి ఇంటివద్దకే మందుల పంపిణీ చేయడం జరుగుతుందని శాసన సభ్యులు తెలిపారు. ఆసుపత్రుల సమాచారం, కోవిడ్ బాధితులు తీసుకోవలసిన జాగ్రత్తలను 104 ఫోన్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చు ఆయన స్పష్టం చేశారు. అనవసరంగా భయపడి బ్లాక్ మార్కెట్ ల వైపు ఇంజక్షన్లు, మందుల కొరకు పరుగు పెట్టాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. అవసరం మేరకు మాత్రమే మందులను, ఇంజెక్షన్లను వినియోగించాలని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. వేడుకలు, జాతులకు ప్రభుత్వం సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆసుపత్రులు, కోవిడ్ కేంద్రాల్లోనూ చికిత్స పొందుతున్న వారికి నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వ్యాక్సినేషన్ ద్వారా కోవిడ్ కు పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొంటూ వ్యాక్సినేషన్ కార్యక్రమం పెద్దఎత్తున జరుగుతోందని ఆయన తెలిపారు. ఆక్సిజన్ కొరత లేదని ఆయన పేర్కొంటూ ఆక్సిజన్ కొరత ఉందని భయానక పరిస్థితులు సృష్టించవద్దని ఆయన కోరారు. ఆక్సిజన్ స్థాయి తగ్గకుండా కరోనా బాధితులు చర్యలు చేపట్టాలని, కరోనా లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా నిర్ధారణ చేసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో కోవిడ్ యాజమాన్యానికి ప్రతి విభాగానికి ఒక్కో అధికారిని నియమించడం జరిగిందని, కోవిడ్ ఆసుపత్రులలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసి ఒక్కో అధికారిని బాధ్యులుగా నియమించారని ఆయన చెప్పారు. చికిత్స పొందుతున్న వారి వివరాలకు కంట్రోల్ రూమ్ లకు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చుని ఆయన సూచించారు. జిల్లాలో 14 ఆసుపత్రులను కోవిడ్ చికిత్సకు సిద్ధం చేసారని ఆయన పేర్కొన్నారు. 18 వందల పడకలు ఆసుపత్రుల్లో సిద్ధం చేయగా, రెండు కోవిడ్ కేర్ కేంద్రాల్లో 2,758 పడకలు సిద్ధం చేసారని ఆయన వివరించారు. ఇప్పటికి 823 మంది వైద్యులు, సిబ్బంది ఇందులో పనిచేస్తున్నారని చెప్పారు. జిల్లాలో 3,30,237 మంది మంగళ వారం నాటికి టీకా వేయించుకున్నారని అందులో కోవాక్సిన్ మొదటి డోస్ 39,544 మంది., రెండవ డోస్ 8,261 మంది వెరసి 47,805 మంది వేయించుకోగా., కోవీషీల్డు టీకాను మొదటి డోస్ 2,26,260 మంది, రెండవ డోస్ 56,172 మంది వెరసి 2,82,432 మంది వేయించుకున్నారని ఆయన వివరించారు.

# మానవత్వం మంటకలిసింది

### రాజాం ప్రేవేట్ హాస్పిటల్ లో ఘటన

శ్రీకాకుళం జిల్లాలోని రాజాంలో అమానవీయ ఘటన చోటు చేసుకుంది. డబ్బులు ఉన్నప్పటికీ అవి వాడుకునే పరిస్థితి లేకపోవడంతో ఓ కరోనా బాధితురాలు రోడ్డుపైనే ప్రాణాలు విడిచింది. కరోనా సోకిన అంజలి అనే మహిళను జిల్లాలోని జీఎంఆర్ వరలక్ష్మి కేర్ ఆస్పత్రికి బంధువులు తీసుకువచ్చారు. అయితే క్యాష్ పేమెంట్ చేయకుండా అడ్మిట్ చేసుకోలేమని కేర్ ఆసుపత్రి సిబ్బంది స్పష్టం చేశారు. ఫోన్ పే, గూగుల్ పే లాంటి ఆన్లైన్ పేమెంట్ను కూడా ఆస్పత్రి సిబ్బంది నిరాకరించింది. కేవలం క్యాష్ ఉంటేనే అడ్మిట్ చేసుకుంటామంటూ స్పష్టం చేసింది. దీంతో చేసేదేమీ లేక డబ్బు కోసం బాధితురాలి బంధువులు ఏటీఎంల చుట్టూ 3 గంటలు తిరిగారు. ఇంతలోనే బాధితురాలు అంజలికి ఊపిరి ఆడక పరిస్థితి విషమించడంతో రోడ్డుపైనే మరణించింది. మృతురాలిది రాజాం మండలం పెంటఅగ్రహారం. కేర్ ఆస్పత్రి సిబ్బంది వైఖరి పట్ల మృతురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు ఆసుపత్రి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డిజిటల్ ఇండియాలో భాగంగా ఆన్లైన్ పేమెంట్స్ ఎక్కువగా జరుగుతున్న ఈ కాలంలో ఇంకా క్యాష్ ట్రాన్సాక్షన్స్ మాత్రమే అంటూ ప్రజల ప్రాణాలు తీయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. 108కు కాల్ చేసినా స్పందించలేదంటూ ప్రభుత్వంపై కూడా మండిపడుతున్నారు.

## మృత్యువాత పడ్డ చేపలు .. మూడు లక్షల రూపాయల మేర నష్టం

జగ్గంపేట ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ తెల్లవారేసరికి చెరువులో ఉన్న చేపలు మొత్తం మృత్యువాత పడ్డాయి అని మత్స్య రైతు తమ ఆవేదనను కన్నీరు మున్నీరుగా వెళ్లగక్కుతున్నారు ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు ఇది తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండల కేంద్రమైన గోకవరం లో జరిగిన సంఘటన గోకవరం నుండి రంప యెర్రంపాలెం వెళ్లే దారిలో ఉన్న చెరువులో పంచాయతీ ఆధ్వర్యంలో చేపల పెంపకం కొరకు తీసుకున్న మహిళా రైతు మూడు టన్నుల మేర చేపలు వేసి ఇ వాటికి మేత తో సహా సుమారు మూడు లక్షల రూపాయల వరకు పెట్టుబడి పెట్టామని తీరా పంట చేతికి వచ్చే సమయానికి చేపలను మృత్యువాత పడడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలి అని ఆవేదన తో కన్నీరు మున్నీరై ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఉచితంగా మాస్కుల పంపిణీ చిత్తూరు ప్రతి ఒక్కరు మాస్కులు ధరించి వ్యక్తిగత దూరం పాటించాలని చిత్తూరు నగర మేయర్ అముద తెలిపారు. కరోనా నివారణ కోసం బుధవారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మాస్కులు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా నివారణకు ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి ప్రభుత్వ సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. కరోన కేసులు పెరుగుతుండడంతో చిత్తూరు ఆస్పత్రిలో పరుపులు కూడా దొరకని పరిస్థితి నెలకొందన్నారు. కావున చిత్తూరు ప్రజలు జాగ్రత్తలు పాటించి కరోన నుండి రక్షణ పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా క్రిస్టియన్ పాస్టర్ షద్రక్ , జోబ్, రమేష్ ప్రసాద్, రాసన పల్లి ప్రకాష్ ,మహిమదాస్ పాల్గొన్నారు.

## అన్న హత్యకు ప్రతీకారం?

### పోలీసులకు చిక్కిన తమ్ముడు

కోదాడ తన వదినతో అక్రమ సంబంధం పెట్టుకొని అడ్డుగా ఉన్న తన అన్నను చంపిన ఒక వ్యక్తిని చంపేందుకు వెళ్లి విఫలం అయ్యి పోలీసులకు దొరికిపోయాడు ఒక వ్యక్తి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన గూగులోతు సురేష్ గత సంవత్సరంలో.. సిరిసిల్ల జిల్లా రామోజీపేట గ్రామానికి చెందిన బస్వరాజు తిరపతయ్య భార్య మమత తో అక్రమ సంబంధం పెట్టుకొని తిరపతయ్య ను హత్య చేసి జైలుకు వెళ్ళొచ్చాడు సురేష్. తిరుపతయ్య తమ్ముడు జనార్దన్ తన అన్న ను చంపిన గూగులోతు సురేష్ పై కక్ష్య పెంచుకున్నాడు. సురేష్ ను చంపేందుకు రెండున్నర లక్షలకు సుపారి కూడా ఇచ్చాడు జనార్దన్. సురేష్ ని హత్య చేసేందుకు కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి వేటకొడవళ్లతో అర్ధరాత్రి వచ్చిన సుపారి గ్యాంగ్, సురేష్ లేకకపోవడంతో సురేష్ తల్లి గూగులోతు రాంబాయి ని బెదిరించారు. ప్రాణభయంతో గూగులోతు రాంబాయి కోదాడ రూరల్ పోలీసులను ఆశ్రయించి పిర్యాదు ఇచ్చింది. దాంతో పోలీసులు రామాపురం క్రాస్ రోడ్డు లో వేటకొడవళ్ల తో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను విచారించ అసలు నిజం బయటపడింది. సుపారి గ్యాంగ్ ను, వారికి సుపారి ఇచ్చిన జనార్దన్ ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

## బహిరంగ ప్రదేశాల్లో బుర్ఖా ధరించడంపై నిషేధం

### శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం



కొలంబో ఏప్రిల్ 28 జాతీయ భద్రత దృష్ట్యా శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ ప్రదేశాల్లో బుర్ఖా ధరించడంపై నిషేధం విధించింది. అయితే కరోనా తీవ్రత దృష్ట్యా మాస్కులు ధరించొచ్చు కానీ, బుర్ఖాలు మాత్రం ధరించరాదు అని స్పష్టం చేసింది. బహిరంగ ప్రదేశాల్లో బుర్ఖా ధరించడంపై నిషేధం విధించిన బిల్లుకు శ్రీలంక కేబినెట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లును శ్రీలంక పార్లమెంట్ ఆమోదించగానే చట్టరూపంలోకి రానుంది. 2019లో ఈస్టర్ సందర్భంగా చర్చిలు, హోటళ్లపై ఉగ్రవాదులు బుర్ఖా ధరించి దాడులు చేసిన నేపథ్యంలో, జాతీయ భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేబినెట్ తెలిపింది. శ్రీలంకలో బహిరంగ ప్రదేశాల్లో బుర్ఖాలు ధరించడంపై నిషేధం విధించడాన్ని పాకిస్తాన్ హై కమిషనర్ తీవ్రంగా తప్పుబట్టింది. ముస్లింల మనోభావాలను దెబ్బతీసేందుకే ఈ నిర్ణయం తీసుకుని, జాతీయ భద్రత దృష్ట్యా విభజన చర్యలు సృష్టిస్తున్నారని పేర్కొంది. శ్రీలంకలో ముస్లింల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని మండిపడింది. 2019లో ఈస్టర్ రోజున నేషనల్ తావీద్ జమాత్ ఆత్మాహుతి దళానికి చెందిన 9 మంది ఉగ్రవాదులు బుర్ఖా ధరించి చర్చిలు, హోటళ్లపై పేలుళ్లకు పాల్పడటంతో 270 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 11 మంది భారతీయులు కూడా ఉన్నారు. ఈ దాడుల్లో 500 మందికి పైగా గాయపడ్డారు.

## తిరుమలలో నాగు పాము హల్చల్

తిరుమల తిరుమలలో నాగు పాము హల్చల్ చేసింది..వి.ఐ.పి లు అధికంగా బస చేసే పద్మావతి సముదాయానికి అతి సమీపంలోని నామాపార్కులో ఆరున్నర అడుగుల పొడవు ఉన్న నాగుపాము పారిశుద్ధ్య కార్మికుల కంట పడింది..దీంతో పారిశుద్ధ్య కార్మికులు భయంతో కేకలు పెడుతూ పరుగులు తీసారు..సమాచారం అందుకున్న విజిలెన్స్ సిబ్బంది అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు స్నేక్ క్యాచర్ భాస్కర్ నాయుడుకు సమాచారం అందించారు..నామాల పార్కు వద్దకు చేరుకున్న భాస్కర్ నాయుడు చాకచక్యంగా పాములను పట్టుకుని అవ్వాచారి కోనలో వదిలి పెట్టాడు..

# కృష్ణాలో 13 మండలాల్లో కిడ్నీ మహమ్మారి

విజయవాడ, ఏప్రిల్ 28,( విభారె) )కరోనాతోపాటు కిడ్నీ మహమ్మారి కృష్ణా జిల్లాలోని ప్రజలను మింగేస్తోంది. సైలెంట్‌గా 13 మండలాలను వణికిస్తోందీ రాకాసి రోగం. రెండు కిడ్నీలు పాడై మృత్యువుతో పోరాడుతున్న వాళ్లు కొందరైతే? ఒక కిడ్నీతో బతుకు ఈడుస్తున్న వారి మరికొందరు. ఏ ఇంటి వారిని కదిలించినా రక్తకన్నీరే ఉబికి వస్తోంది. కృష్ణాజిల్లాలోని 13 మండలాలను కిడ్నీ మహమ్మారి వణికిస్తోంది. తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం, విస్సన్నపేట, చాట్రాయి, నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు, జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల ప్రజల ప్రాణాలతో ఆడుకుంటోందీ పాడు జబ్బు.ఏ తాండాలోకి వెళ్లినా ఇవే కథలు. కన్నీటి గాథలు. ఏ ఇంటిని పలకరించినా ఇదే వ్యథ. ఏ గడప తొక్కినా చావుకబురే.. కడుపు తరుక్కుపోయే విషాదాలు. ఒక్కటి కాదు.. రెండు కాదు.. 300 గ్రామాల్లో ఇవే దృశ్యాలు. గుండెలను పిండేసే ఆర్తనాథాలు. కొందరికి 2 కిడ్నీలు పాడయ్యాయి. మరికొందరు ఒక కిడ్నీతోనే బతుకుతున్నారు. కొన్ని గ్రామాల్లో ఇంటికొకరు చచ్చిపోయారు. కొన్ని ఇళ్లల్లో అమ్మా, నాన్న చనిపోయి పిల్లలు అనాథలయ్యారు. మరికొన్ని ఇళ్లల్లో చేతికి అందివచ్చిన కొడుకులు అర్థాంతరంగా తనువు చాలించారు. తల్లిదండ్రుల బతుకు భారంగా మిగిల్చారు.కిడ్నీ డిసీజ్ ఓవైపు కమ్మేస్తుంటే? వారిపై కొవిడ్ మరింతగా విరుచుకుపడుతోంది. ఆక్సిజన్ అందక అవయాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సరైన టైంలో డయాలసిస్ చేయకపోతే రోగి ప్రాణాలమీదకు వస్తుందని డాక్టర్ అమ్మన్న అంటున్నారు.విజయవాడ ప్రభుత్యాసుపత్రిలో బెడ్లు లేక ఇబ్బంది పడుతున్నారు కిడ్నీ రోగులు. కేవలం 9 బెడ్స్‌పై డియాలసిస్ చేస్తున్నారు. తీవ్రమైన కిడ్నీ సమస్యతో ఉన్నవారిని మాత్రమే అడ్మిట్ చేసుకుంటున్నారు. మిగిలిన వారు విలవిల్లాడిపోతున్నారు. అయితే, కొందరికి ప్రభుత్వ సాయం కొందరికే అందుతోంది. చదువురాని వారికి ఈ సాయం సంగతే తెలియడం లేదు.ఇంతకీ

ఈ కిడ్నీ రోగాలకు కారణమేంటి? పచ్చని గ్రామాలను మహమ్మారి ఎందుకు కాటేస్తోంది అంటే కారణం నీళ్లు. దాహం తీర్చే వాటరే దహించేస్తోంది. నీళ్లలోని ఫ్లోరైడ్ ప్రాణం తీస్తోంది. ముందుగా ఒళ్లు, కీళ్లు , నడుం నొప్పితో మొదలవుతోంది. చిన్న సమస్యలే అనుకుంటారు. లోకల్ వైద్య సిబ్బందితో మాట్లాడి యాంటీబయాటిక్స్ పెయిన్ కిల్లర్లు తీసుకుంటారు. అవన్నీ కిడ్నీలపై ప్రభావం చూపుతున్నాయి. కొద్ది రోజుల్లోనే కిడ్నీలు పాడవుతున్నాయి. చివరి నిమిషంలో పెద్ద డాక్టర్లకు చూపిస్తున్నారు. తమకు కిడ్నీ రోగం ఉందని తెలిసే సరికే ప్రాణం మీదికొస్తోంది. కూలి పనులకు వెళ్లలేక చాలా మంది ఇంట్లోనే కూలబడుతున్నారు.

# సొంత ఇంటికి వెళ్లని పద్మజ, పురుషోత్తమనాయుడు

తిరుపతి, ఏప్రిల్ 28, (( విభారె) )ఏపీలో సంచలనం సృష్టించిన చిత్తూరు జిల్లా మదనపల్లె జంట హత్యల కేసులో నిందితులకు బెయిల్ మంజూరైంది. ఈ కేసులో అరెస్టైన పద్మజ, పురుషోత్తంనాయుడులు పోలీసులు అదుపులోకి తీసుకుని 90 రోజులు పూర్తవడంతో రెండో ఏడీజే కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారిద్దరు సబ్ జైలు నుంచి ఏప్రిల్ 27న బయటకు వచ్చారు. అయితే వాళ్లిద్దరూ కూతుళ్ల హత్యలు జరిగిన శివ్ నగర్ లోని సొంతింటికి వెళ్లలేదు.బెయిల్ రాగానే పురుషోత్తం నాయుడి సోదరుడు శివ్ నగర్‌లో అన్న ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉంటున్న పెంపుడు కుక్కను తీసుకుని సబ్ జైలు నుంచి బయటకు వచ్చిన తన అన్న, వదినలను కారులో ఎక్కించుకున్నాడు. పురుషోత్తం నాయుడి స్వగ్రామమైన తవణంపల్లె మండలం, కొండ్రాజుకాలువ గ్రామానికి తీసుకెళ్లాడు. పురుషోత్తం నాయుడు, పద్మజ అక్కడే ఉండాలని నిర్ణయించుకున్నారట. పల్లెటూరి వాతావరణంలో ప్రశాంత వాతావరణంలో ఉండాలని భావించి అక్కడికి వెళ్లినట్లు తెలుస్తోంది.చిత్తూరు జిల్లా మదనపల్లెకి చెందిన పురుషోత్తమ నాయుడు, పద్మజ దంపతులు జనవరి 24న తమ కన్నబిడ్డలైన అలేఖ్య, సాయిదివ్యను హత్య చేశారు. ఈ కేసులో వారిని మదనపల్లె సబ్ జైలుకు తరలించగా.. రెండు రోజులకే పద్మజ అరుపులు, కేకలతో ఖైదీలు భయపడిపోయారు. కలియుగ యుద్ధం జరుగుతోంది.. శివుడు వస్తున్నాడు.. కలియుగం అంతమవుతుంది అని పెద్దగా కేకలు వేశారు. పద్మజ ఉంటున్న బ్యారక్‌లో మహిళా ఖైదీలు రాత్రిళ్లు నిద్రించాలంటే భయపడ్డారు. పద్మజ దెబ్బకు ఆందోళనకు గురైన సహచర ఖైదీలు ఆమెను ప్రత్యేక గదికి తరలించాలని మొర పెట్టుకున్నారు. పురుషోత్తంనాయుడు కూడా ఒంటరిగా కూర్చొని ఒక్కోసారి ఏడ్చారు.జైలు సిబ్బంది అధికారులతో మాట్లాడి ఇద్దర్ని తిరుపతి రుయాకు తరలించగా.. మానసిక వైద్యనిపుణులు వారిని చికిత్స నిమిత్తం విశాఖ ఆస్పత్రికి తరలించాలని రిఫర్ చేశారు. నిందితులు పురుషోత్తం, పద్మజలను విశాఖ తరలించారు.. ఇద్దర్ని విశాఖ మానసిక చికిత్సాలయంలో చేర్చారు. భార్యాభర్తలను వైద్యుల పర్యవేక్షణలో వేర్వరుగా ఉంచారు. ఇద్దరూ కోలుకోవడంతో తిరిగి మదనపల్లె సబ్ జైలుకు తరలించారు.

# మే నెలలో కరోనా వ్యాక్సిన్ అనుమానమే

విజయవాడ, ఏప్రిల్ 28, ( విభారె) ఆంధ్రప్రదేశ్‌లో 18 సంవత్సరాలు నిండిన వారికి మే నెలలో కరోనా వైరస్ వ్యాక్సిన్ ఇచ్చే పరిస్థితి లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. కరోనా వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో భాగంగా మే 1వ తేదీ నుంచి 18 ఏళ్లు పైబడిన వారందరికీ టీకాలు వేయనున్నట్లు ఇటీవలే కేంద్రం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం 18 ఏళ్లు దాటిన వారందరికీ టీకా పంపిణీ కార్యక్రమం జూన్ నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు.18 ఏళ్లు దాటిన వారంతా టీకా వేయించుకోవడానికి కొవిన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు మరికొంత సమయం పడుతుందన్నారు. టీకా పంపిణీ కోసం సంబంధిత కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నామని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి ఒప్పందాలు జరగలేదన్నారు. టీకాల కోసం వివిధ కంపెనీలతో మాట్లాడామని.. అయితే, ఉత్పత్తిలో సగం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాలని, ఆ తర్వాతే రాష్ట్రాలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారని తెలిపారు. వాళ్లు చెబుతున్న లెక్కల ప్రకారం జూన్ వరకు రాష్ట్రాలకు టీకాలు సరఫరా చేయలేరని పేర్కొన్నారు.కాబట్టి రాష్ట్ర ప్రజలకు టీకాలు ఇచ్చేందుకు మరికొంత సమయం పడుతుందని అనిల్ కుమార్ సింఘాల్ అన్నారు. అందుకే మే నెలలో కాకుండా జూన్ నెలలో 18 ఏళ్లు నిండిన వారందరికీ వ్యాక్సిన్ ఇస్తామని అనిల్ కుమార్ సింఘాల్ వెల్లడించారు. దీని కోసం 18 ఏళ్లు దాటిన వారు పేర్లు ఎప్పుడు నమోదు చేసుకోవాలన్న సమయాన్ని త్వరలో ప్రకటిస్తామన్నారు. కోవిడ్ చికిత్సలో కీలకమైన రెమ్‌డెసివిర్

# కార్బైడ్ తో పండించిన మామిడి పండ్లలను ఇలా గుర్తించండి..!



వేసవి కాలంలో సహజంగానే మామిడి పండ్లకు డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. అనేక రకాల జాతులకు చెందిన మామిడి పండ్లు మనకు ఈ సీజన్‌లో కనిపిస్తూ నోరూరించేలా చేస్తుంటాయి. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా.. ప్రస్తుతం అనేక మంది వ్యాపారులు కార్బైడ్ ఉపయోగించి పండించిన మామిడి పండ్లనే విక్రయిస్తున్నారు. దీంతో అలాంటి పండ్లను మనం కొని తింటున్నాం.. అనారోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నాం.. అయితే కార్బైడ్ ఉపయోగించి పండించిన మామిడి పండ్లను మనం సులభంగానే గుర్తించవచ్చు. అదెలాగంటేకార్బైడ్ ఉపయోగించి పండించిన మామిడి పండ్లపై అక్కడక్కడా ఆకుపచ్చదనం ఉంటుంది. అదే సహజంగా పండిన పండ్లయితే కాయ మొత్తం ఒకే రంగులో ఉంటుంది. ముదురు ఎరుపు, పసుపు రంగులో ఈ పండ్లు ఉంటాయి.సహజంగా పండిన మామిడి పండ్లపై నొక్కితే మెత్తగా అనిపిస్తుంది. అలాగే ఆ పండ్ల తొడిమల దగ్గర మంచి వాసన వస్తుంది.కార్బైడ్ ఉపయోగించి పండించిన మామిడి పండ్లు లోపల అక్కడక్కడా పచ్చిగానే ఉంటాయి. దీంతో పులుపు తగులుతుంది. అదే సహజంగా పండిన పండ్లయితే రసం ఎక్కువగా వస్తుంది. అలాగే రుచి కూడా తియ్యగా ఉంటుంది.కార్బైడ్ ఉపయోగించి పండించిన పండ్లలను నీటిలో వేస్తే పైకి తేలుతాయి. అదే సహజంగా పండించిన పండ్లయితే నీటిలో మునుగుతాయి.

# 'ట్రావెల్ బ్యాన్'వ అనేది సమస్యే కాదు: పాంటింగ్



అహ్మదాబాద్: కరోనా వైరస్ విజృంభణ కారణంగా భారత్ నుంచి విమానరాకపోకలను ఆస్ట్రేలియా ప్రభుత్వం నిలిపివేయడంపై ఆ దేశ మాజీ క్రికెట్ కెప్టెన్ రికీ పాంటింగ్ స్పందించాడు. ఇప్పటికే పలువురు ఆస్ట్రేలియా క్రికెటర్లు ఐపీఎల్ వీడి స్వదేశానికి బయల్దేరిన తరుణంలో ట్రావెల్ బ్యాన్‌పై చర్చనడుస్తోంది. దీనిపై మాట్లాడిన పాంటింగ్.. అదేమీ పెద్ద సమస్య కాదని అంటున్నాడు. భారత్ నుంచి విమానరాకపోకలను తమ దేశం నిలిపివేయడాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదన్నాడు. అది చాలా చిన్న విషయమని, దాని గురించి పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదన్నాడు.తమ జట్టులోని విదేశీ ఆటగాళ్లు విమాన రాకపోకల నిషేధం అంశాన్ని మరీ ఎక్కువగా పట్టించుకోవడం లేదన్నాడు. కానీ భారత్‌లోని ప్రజలు పడుతున్న ఇబ్బందులే తమను తీవ్రంగా కలిచివేస్తున్నాయన్నాడు. తాము బయోబబుల్‌లో ఉన్నామని, భారత్‌లోని బయట పరిస్థితులే తీవ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రతీ రోజూ బారత్‌లో కరోనా కేసులు ఎక్కువ నమోదు కావడం ఆందోళన పరుస్తుందన్నాడు. తమ జట్టులోని రవిచంద్రన్ అశ్విన్ తల్లిదండ్రులకు కరోనా సోకడంతో లీగ్‌ను వీడిన విషయాన్ని పాంటింగ్ ప్రస్తావించాడు. ఈ తరహా విపత్కర పరిస్థితులే తమను ఎక్కువ బాధిస్తున్నాయన్నాడు. ప్రస్తుత సమయంలో ఎవరైతే కోవిడ్-19తో బాధపడుతున్నారో వారి చుట్టే తమ మనసు తిరుగుతుందని, తమ ప్రయాణాల గురించి ఎటువంటి ఆందోళనా లేదన్నాడు. భారత్‌లో కరోనా వైరస్ తీవ్ర రూపం దాల్చడంతో మనదేశ విమాన ప్రయాణాలపై ఆస్ట్రేలియా ప్రభుత్వం మే 15వరకూ నిషేధాన్ని విధించిన సంగతి తెలిసిందే. అప్పటికి పరిస్థితులు

## ఆ విషయమే మమ్మల్ని బాధిస్తోంది

చక్కబడితే తిరిగి విమానరాకపోకలకు మార్గం సుగమం అవుతుంది. ఒకవేళ భారత్‌లో అప్పటికీ ఇదే పరిస్థితి ఉంటే మాత్రం ఐపీఎల్‌లో ఉన్న ఆస్ట్రేలియా క్రికెటర్లు తమ దేశాలకు వెళ్లడం కష్టతరం కావొచ్చు.

## మ్యాచ్ చూశాకా ఆశలు చిగురించాయి.. కొత్త విజేతను చూస్తా


అహ్మదాబాద్: ఐపీఎల్ 14వ సీజన్‌లో మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన థ్రిల్లింగ్ మ్యాచ్‌లో ఆర్‌సీబీ ఒక్క పరుగు తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఒత్తిడిలో చివరి ఓవర్ వేసిన ఆర్‌సీబీ బౌలర్ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేసి విజయాన్ని అందించాడు. కాగా మ్యాచ్ అనంతరం టీమిండియా ప్రధాన కోచ్ రవిశాస్త్రి ట్విటర్ వేదికగా స్పందించాడు.కోహ్లి, పంత్‌ల ఫోటోను షేర్ చేస్తూ ఈసారి ఐపీఎల్ టైటిల్‌ను ఎప్పుడు గెలవని జట్లే గెలవనున్నాయనిపిస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్, ఆర్‌సీబీ ఎవరు చూసుకున్నా ఐపీఎల్ టైటిల్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నిన్నటి మ్యాచ్ అద్భుతం.. ఆ మ్యాచ్‌ల నాలో కొత్త ఆశలు రేకెత్తాయి. ఈసారి ఐపీఎల్‌లో కచ్చితంగా కొత్త విజేతను చూస్తాం.. అంటూ క్యాప్షన్ జత చేశాడు. ఇప్పటికే ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్‌తో పాటు రెండు సార్లు చాంపియన్ కేకేఆర్ ఈ సీజన్‌లో తమ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంలో విఫలమతున్నాయని తెలిపాడు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'వ ఏబీ డివిలియర్స్ (42 బంతుల్లో 75 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్సర్లు) చెలరేగగా... రజత్ పటిదార్ (22 బంతుల్లో 31; 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 170 పరుగులు చేయగలిగింది. రిషభ్ పంత్ (48 బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు), షిమ్రాన్ హెట్‌మైర్ (25 బంతుల్లో 53 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. కాగా ఢిల్లీపై విజయంతో ఆర్‌సీబీ 10 పాయింట్లతో టాప్ స్థానానికి చేరుకోగా.. ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో మూడోస్థానంలో నిలిచింది.

# త్రివిక్రమ్ కోబలి (స్క్రిప్ట్) రెడీ ఫర్ సేల్?



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తో మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కోబలి అనే సినిమా తెరకెక్కించాలని ప్రయత్నించిన సంగతి తెలిసిందే. అత్తారింటికి దారేది తర్వాత సెట్స్ కెళ్లాల్సినది. (స్క్రిప్ట్ రెడీ చేసి టీమ్ ని ప్రిపేర్ చేసుకుని ఆ తర్వాత రకరకాల కారణాలతో కుదరక ఆపేశారు.కానీ ఆ (స్క్రిప్ట్‌పై త్రివిక్రమ్ మమకారం అలానే ఉంది. పవన్ రెడీగా ఉంటే దాంతో సినిమా తీయాలని భావిస్తున్నాడు. కానీ సన్నివేశం చూస్తుంటే ఇప్పట్లో వీలుపడేట్టు లేదు. పవన్ వరుసగా మూడు నాలుగు సినిమాలకు కమిటయ్యాడు. తాను కూడా మహేష్ తో సినిమాకి కమిటయ్యాడు. పవన్ అందుబాటులోకి వచ్చే వరకూ త్రివిక్రమ్ వేచి చూడాల్సిన పరిస్థితి.అయితే మారే కాలానికి అనుగుణంగా (స్క్రిప్ట్ మోడల్ కూడా మారిపోతుంది. అంటే మళ్లీ మళ్లీ రీవర్క్ చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. అందుకే ఈ (స్క్రిప్ట్‌ను వృధా చేయకుండా పవన్ తో చేయాలనుకునే వేరొక దర్శకుడికి ఇచ్చేందుకు కూడా త్రివిక్రమ్ సిద్ధంగా ఉన్నారట. అందుకే దానిని పూర్తి స్థాయిలో బౌండ్ (స్క్రిప్ట్ చేసి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది.నిజానికి తాను తీయాల్సినదే అయినా ఇప్పట్లో కుదరని సన్నివేశంలోనే వేరొకరికి బదిలీ చేసే ఆలోచన ఉందట. అలా కాకపోతే పవన్ కనీసం 3 నెలల కాల్షీట్లు తనకు ఇచ్చినా వెంటనే పూర్తి చేయాలన్న ఆలోచన ఉంది. కానీ పవన్ కాల్షీట్ల విషయంలో క్లారిటీ లేదు. కనీసం (స్క్రిప్ట్ వరకూ సేల్ అయినా సంతోషమే. అయినా కొన్నిటికి కాలమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

# 100 కోట్ల సినిమా బుల్లితెర పై నిరాశ పరిచిందా..?



మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్ - కృతి శెట్టి జంటగా నటించిన ‹ఉప్పెన› సినిమా. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా.. మైత్రీ మూవీ మేకర్స్ - సుకుమార్ రైటింగ్స్ సంస్థలు కలిసి నిర్మించాయి. ఫిబ్రవరిలో వాలెంటైన్స్ వీక్ లో విడుదలైన ఈ చిత్రం పాజిటివ్ టాక్ తో నడిచింది. కరోనా పాండమిక్ తర్వాత 100 శాతం ఆక్యుపెన్సీతో ప్రదర్శించబడటం కూడా ఈ సినిమాకు కలిసొచ్చిందని చెప్పవచ్చు. ఇక ‹ఉప్పెన› సినిమా ఓ క్లాసిక్ అని.. ఇప్పటి వరకు ఇలాంటిది రాలేదని బాగానే ప్రచారం చేశారు. అలానే రికార్డ్ స్థాయి వసూళు రాబట్టిందని.. 100 కోట్ల క్లబ్ లో చేరిందని అధికారిక పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. ఈ క్రమంలో ఇటీవల బుల్లితెరపైకి వచ్చింది ‹ఉప్పెన›.ప్రముఖ తెలుగు ఎంటర్టైమెంట్ ఛానల్ ‹స్టార్ మా› లో ఏప్రిల్ 18వ తేదీ సాయంత్రం ‹ఉప్పెన› సినిమా టెలికాస్ట్ అయింది. ఈ సినిమా స్మాల్ (స్క్రీన్ పై సత్తా చాటుతుందని హయ్యెస్ట్ టీఆర్పీ రేటింగ్ తెచ్చుకుంటుందని అనుకున్నారు. అయితే ఈ చిత్రాన్ని జనాలు టీవీలో పెద్దగా ఆదరించలేదని కామెంట్స్ వస్తున్నాయి. నిజానికి థియేటర్ లో బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకున్న సినిమా బుల్లితెర మీద కూడా అదే రేంజ్ లో రికార్డులు క్రియేట్ చేయాలి. టీఆర్పీ ఎంత వచ్చిందనేది తెలియనప్పటికీ.. ‹ఉప్పెన› విషయంలో మాత్రం అది జరగలేదని టాక్ నడుస్తోంది. సక్సెస్ మీట్ అని సక్సెస్ సెలబ్రేషన్స్ అని ఈ సినిమాకు సంబంధించి అనేక ఈవెంట్స్ చేసిన ప్రొడ్యూసర్స్ అందుకే ‹ఉప్పెన› టీవీ రికార్డుల గురించి ప్రస్తావించలేదని.. బుల్లితెరపై అత్యధిక టీఆర్పీ వచ్చి ఉంటే ఈపాటికే హడావుడి ఉండేదని ఫిల్మ్ సర్కిల్స్ లో కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# రామ్ జోడీగా ప్రియా ప్రకాశ వారియర్?



రామ్ హీరోగా ఇటీవల వచ్చిన ‹రెడ్› సినిమా ఆశించినస్థాయిలో ఆడలేదు. దాంతో ఆయనతో పాటు అభిమానులంతా కూడా నిరుత్సాహపడ్డారు. ఆ తరువాత పెద్దగా గ్యాప్ లేకుండా రామ్ మరో సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు. ఆయన తాజా చిత్రం లింగుస్వామి దర్శకత్వంలో రూపొందుతోంది. విభిన్నమైన కథాకథనాలతో నిర్మితమవుతోన్న ఈ సినిమాలో కథానాయికగా కృతి శెట్టి కనిపిస్తోంది. ఆ తరువాత రామ్ చేయనున్న సినిమాలో హీరోయిన్ గా ప్రియా ప్రకాశ్ వారియర్ కనిపించే అవకాశాలు ఉన్నాయనే టాక్ ఫిల్మ్ నగర్లో షికారు చేస్తోంది. తెలుగులో ప్రియా ప్రకాశ్ ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. ఇటీవల నితిన్ సినిమా ‹చెక్›లో మెరిసిన ఈ పిల్ల ఆ తరువాత సినిమాగా ‹ఇష్క్› చేసింది. తేజ సజ్జా జోడీగా నటించిన ఈ అమ్మాయి ప్రస్తుతం తన దూకుడు పెంచే పనిలో ఉంది. ఈ అమ్మాయిని సంప్రదిస్తున్న దర్శక నిర్మతల సంఖ్య ఎక్కువగానే ఉందని అంటున్నారు. తెలుగు కథలను వినడంపైనే ఈ సుందరి ఇప్పుడు ఎక్కువ దృష్టి పెట్టిందని చెబుతున్నారు. ఈ సుందరి మొగ్గుచూపిన సినిమాల్లో రామ్ నెక్ట్స్ మూవీ కూడా ఉందనే టాక్ వినిపిస్తోంది.రామ్ తదుపరి సినిమా మారుతి దర్శకత్వంలో ఉండనుందనే ఒక వార్త కొన్ని రోజులుగా షికారు చేస్తోంది. ప్రస్తుతం గోపీచంద్ హీరోగా ‹పక్కా కమర్షియల్› సినిమా చేస్తున్న మారుతి ఆ తరువాత సినిమాను రామ్ తో చేయనున్నట్టుగా చెప్పుకుంటున్నారు. ఆయన సినిమా కోసం ప్రియా ప్రకాశ్ ను అడిగారా? లేదంటే అంతకంటే ముందుగానే సెట్ చేసిన మరో ప్రాజెక్టు ఏదైన ఉందా? పోతే ఇదంతా పుకారిస్టుల పనేనా? అనే విషయంలో స్పష్టత రావలసి ఉంది. మొత్తానికి ప్రియా ప్రకాశ్ జోరు అయితే మాత్రం నెమ్మది నెమ్మదిగా పెరుగుతోందనే విషయం మాత్రం అర్థమవుతోంది.

# పవన్ ద్విపాత్రాభినయం లుక్ ఫైనల్ అయ్యిందా?

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ద్విపాత్రాభినయం చేయబోతున్నారా? అంటే అవుననే సమాచారం. హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న పీఎస్ పీకే 28తో ఇది సాధ్యమవుతోందన్న గుసగుసలు తాజాగా వైరల్ అవుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. వకీల్ సాబ్ తో మూడేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి వచ్చిన పవన్ గ్రేట్ కంబ్యాక్ గురించి ఇటీవల ఆసక్తికర చర్చ సాగుతోంది. బాక్సాఫీస్ వద్ద తొలి వీకెండ్ అసాధారణ వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం కోవిడ్ వల్ల కొంత లాస్ ని భరించాల్సొచ్చింది.పవన్ ప్రస్తుతం తదుపరి సినిమాలపైనా దృష్టి సారించారు. అయ్యప్పనున్ కోషియం రీమేక్ తో పాటు హిస్టారికల్ కాన్సెప్టుతో రూపొందుతున్న హరి హర వీర మల్లు చిత్రీకరణల్ని పూర్తి చేయాల్సి ఉండగా కోవిడ్ సోకి చికిత్స పొందుతున్నారు. తరువాత హరీష్ శంకర్ పీఎస్ పీకే28 కి పవన్ కమిట్ మెంట్ ఇచ్చారు.. ఈ సినిమాలన్నీ అత్యంత భారీ బడ్జెట్ తో క్రేజీగా తెరకెక్కుతున్నవే.తాజాగా పవన్ కళ్యాణ్ హెయిర్ స్టైలిస్ట్ రామ్ ఓ కీలకమైన సమాచారాన్ని లీక్ చేశారు. పిఎస్పికె 28 లుక్ విషయంలో క్రేజ్.. వకీల్ సాబ్ కంటే 10 రెట్లు పెద్దదిగా ఉంటుందని ఆయన అన్నారు. లుక్ గురించి హరీష్



శంకర్ పవన్ ల మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగింది. స్టైలిస్ట్ తనవంతు సాయమందిస్తున్నారు. ఇటీవల ముగిసిన ఫోటోసెషన్ ను హరీష్ శంకర్ త్వరలో రిలీజ్ చేయనున్నారు. హరీష్ శంకర్ చిత్రంలో పవన్ ద్విపాత్రాభినయంతో సర్ ప్రైజ్ చేస్తారని లెక్చరర్ పాత్రలోనూ కనిపిస్తారని కూడా లీకులందుతున్నాయి. మొత్తానికి పవన్ అభిమానుల్ని ఖుషీ చేసే చాలా సంగతులు రివీలయ్యాయి. పవన్ - హరీష్ కాంబినేషన్ లో గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్ బస్టర్ మూవీ వచ్చిన సంగతి తెలిసిందే.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190